ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 3 నవంబరు 2025 | 5







నరసన్న.. చూడన్నా!

అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి తెప్పోత్సవం ఆదివారం వశిష్ఠ గోదావరిలో కన్నుల పండువగా సాగింది.. వేలాదిగా భక్తజనం హాజరై స్వామిని కన్నులారా తిలకించారు.. చల్లంగ చూడు నరసన్న అంటూ కొలిచారు..



ఊరేగిన వెంకన్న..

ఆ స్వామి వైభవాన్ని చూడడానికి రెండు కన్నులూ చాలవు.. అంతలా వాడపల్లి వేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం ఆదివారం గౌతమి గోదావరిలో నిర్వహించారు. అందంగా అలంకరించిన తెప్పపై స్వామి ఊరేగారు. వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.



సత్యదేవ.. కనవా!

అన్నవరం సత్యదేవుడి హంస వాహనం ఆకట్టుకుంది.. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామి తెప్పోత్సవం పంపానదిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.



బతుకులపై హాల్‌సెల్!

ప్రస్తుతం సెల్‌ఫోన్ చాలా ప్రమాదకరంగా తయారైంది.. అది చేతిలో ఉంటే అన్నీ ఉన్నట్టే.. ఫ్రెండ్స్ కావాలంటే ఫ్రెండ్స్‌ని ఇస్తోంది.. ప్రేమికుడు కావాలన్నా.. ప్రేమికురాలు కావాలన్నా క్షణాల్లో ఇచ్చేస్తోంది.. అవి కాకుండా వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, షేర్‌చాట్ తదితర యాప్‌లు ఉన్నాయి.. ఈ సెల్‌ఫోన్‌కు యువత బానిసగా మారిపోతున్నారు.. గంటల తరబడి చాటింగ్‌లు.. గంటల తరబడి టాకింగ్‌లు.. గంటల తరబడి ఆటలు... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నోఎన్నెన్నో.. చదువును వదిలేసి మరి ఆ మాయలో మునిగితేలుతున్నారు.. తెలిసీతెలియని వయసులో యువతకు అదో ప్రేమమార్గంగా ఉంది.. అది కట్టడి చేయడానికి తల్లిదండ్రులు శతవిధాలా ప్రయత్నిస్తున్నా అందులో చిక్కుకుపోయే యువతే ఎక్కువ.. సెల్ ఫోన్ ఎంత అవసరమో.. అంతే నాశనం కూడా చేస్తుందనేది జగమెరిగిన సత్యం.



జీవితంపై అలక్ష్యం!

ప్రస్తుతం ఒక లక్ష్యం పెట్టుకుని చదివే యువత చాలా తక్కువ శాతం కనిపిస్తున్నారు.. తల్లిదండ్రుల పోరు తప్ప.. ఏదో ఒకటి సాధిద్దాం అని చదువుకునే యువతరాన్ని వేళ్లపై లెక్కించవచ్చు.. తెలిసీతెలియని వయసులో ఆశలు.. కోరికలంటూ పరుగులు పెడుతున్నారు.. ఆశయాలను వదిలేస్తున్నారు.. బడి దగ్గర నుంచి కళాశాలల వరకూ ఎన్నెన్నో ప్రేమకథలు.. జీవితంలో ఏదో ఒకటి సాధించిన తరువాత ప్రేమించుకుంటే తప్పులేదు. కానీ ఏమీ లేకుండా ప్రేమ అంటున్నారు.. ఆ దోమ కుట్టడంతోనే అన్నీ గాలికే వదిలేస్తున్నారు.. ఆ ప్రేమ మోజులో పడి మోసపోయిన బాలికలు కోకొల్లలు.. మన జిల్లాలోనే చూస్తే ఏడో తరగతి చదివే బాలికలు గర్భవతులు.. ఇంజనీరింగ్ చదివే అమ్మాయి మోసపో తూనే ఉంటున్నారంటే పరిస్థితి ఎంత చేయి దాటుతుందో అర్థం చేసుకోవచ్చు.



కోరికల ఊబి..

కోరికలే గుర్రాలైతే.. అనే సామెత ఒకటుంది.. ఇది అమ్మాయికైనా.. అబ్బాయికైనా ఒక్కటే.. కోరికలు ఉండవచ్చు కానీ మితిమీరకూడదు.. ప్రస్తుతం కోరికలు మితిమీరిపోతున్నాయి. అవే యువతీ యువకులను.. బాలికలను పక్కదారి పట్టిస్తున్నాయి.. చాలా మంది బాలబాలికలు హీరోహీరోయిన్లను ప్రేమిస్తారు. వారిలా ఉండాలని తహతహలాడతారు.. అది చాలా ఖర్చుతో కూడుకున్నది.. ఆర్థిక అవసరాలకు చాలా మంది బాలికలు పక్కదారి పడుతున్నారు.. అదే వ్యసనంగా మార్చుకుంటున్నారు.. చదువుకున్నా ఏం చేసినా అదే ఆలోచన.. చదువును పక్కన పెట్టి ఎంతో మంది బాలికలు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. చదువుకునే వయసులో చదువుకుంటే భవిష్యత్ చాలా అందంగా ఉంటుంది. అది చాలా ఆలోచించకుండా కోరికలనే ఊబిలో చిక్కిపోతున్నారు.



తుఫాన్ సాయం అందజేస్తున్న రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

మొంథా బాధితులకు సాయం
రూ.23.26 లక్షలు
కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ బాధిత 1,185 కుటుంబాలకు రూ23.26 లక్షలు ఆర్థిక సహాయం అందజేశామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.జిల్లాలో అనపర్తి మండలంలో 166 కుటుంబాలకు రూ.3.45 లక్షలు, బిక్కవోలులో 38 కుటుంబాలకు రూ.74 వేలు, గోకవరం మండలంలో 2 కుటుంబాలకు రూ.6వేలు, కడియం మండలంలో 122 కుటుంబాలకు రూ.2 .6 లక్షలు, కోరుకొండలో 19 కుటుంబాలకు రూ.41 వేలు, రాజమహేంద్రవరం అర్బన్‌లో 120 కుటుంబాలకు రూ2.67 లక్షలు, రాజమహేంద్రవరం రూరల్‌లో 89 కుటుంబాలకు రూ.1.55 లక్షలు, రాజానగరంలో 27 కుటుంబాలకు రూ.45 వేలు చొప్పున పంపిణీ చేశామ న్నారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో 583 కుటుంబాలకు రూ.11.39 లక్షలు, కొవ్వూరు డివిజన్‌లో 602 కుటుంబాలకు రూ. 11.87 లక్షలు అందించామన్నారు.

నేడు పీజీఆర్‌ఎస్

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక పీజీఆర్‌ఎస్ కార్యక్రమం సోమవారం జిల్లావ్యాప్తంగా యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు జిల్లా కేంద్రానికి రాకుండా తమ డివిజన్, మండల కేంద్రాలు, గ్రామ ,వార్డు సచివాయాల్లో అర్జీలను సమర్పించవచ్చని తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను 1100 టోల్ ఫ్రీ నెంబర్ లేదా, మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా సమర్పించవచ్చని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల కోసం వాట్సప్ గవర్నెన్స్ నెంబరు 9552300009ను వినియోగించాలన్నారు.

చదువుకునేందుకు ఊరు కాని ఊరొచ్చింది.. ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూనే విద్యనభ్యసిస్తోంది.. సెల్‌ఫోన్‌లో పరిచయం ఒక యువకుడిని అన్నగా చెప్పుకునే వరకూ వెళ్లింది.. దీపావళి ముందు రోజు ఆ అన్నయ్య వచ్చాడు.. దీపావళి బాణసంచా కొని ఇస్తానని చెప్పి తీసుకెళ్లాడు. అన్నయ్య కదా అని నమ్మి వెళ్లింది. రెండు గంటల తరువాత ఒంటిపై గాయాలతో తిరిగొచ్చింది. అనుమానం వచ్చిన వార్డెన్ ఆరా తీస్తే.. జరిగింది చెప్పి గొల్లుమంది.. రాజమహేంద్రవరంలో జరిగిన ఈ సంఘటన సెల్‌ఫోన్ పరిచయం ఎంత ప్రమాదకరమో చెబుతోంది.

ఆ బాలిక 7వ తరగతి చదువుతోంది.. తెలిసీ తెలియని వయసు.. అందునా అమ్మా నాన్న లేరు.. అమ్మమ్మ వద్ద ఉండి గురుకులంలో చదువుకుంటుంది.. అమ్మమ్మ ఊరికే చెందిన తాత వయసున్న వ్యక్తి ఆ బాలికను పరిచయం చేసుకున్నాడు.. బాలికకు ఎవరూ లేకపోవడంతో ఖాళీ ఉన్నప్పుడల్లా అతను వెళ్లేవాడు.. గురుకులంలో తాతగా చెప్పుకుని బయటకు రమ్మనేవాడు. బాలిక ఊరే కావడంతో అతనితో వెళ్లేది.. అలా నాలుగుసార్లు వెళ్లింది.. నాలుగోసారి అతనిలో వికృత రూపం బయటపడింది.. తెలిసినా బాలికలు ఒకరి వెంట వెళ్లడం ఎంత ప్రమాదకరమో తునిలో జరిగిన ఈ సంఘటన రుజువు చేస్తోంది.

- రాజమహేంద్రవరం/ కాకినాడ-ఆంధ్రజ్యోతి

నమ్మొద్దు.. నమ్మొద్దు!
అమ్మాయిలు జాగ్రత్త



స్వాతంత్రం.. స్వేచ్ఛ.. రెండిటికీ మధ్య యోజనాల వ్యత్యా సం ఉందని పెద్దలు చెప్పే మాట అక్షర సత్యమని ఛిద్రమ వుతున్న బాలికలు/అమ్మాయిల జీవితాలు రుజువు చేస్తున్నాయి. రకరకాల కారణాలతో ప్రేమ.. ఆకర్షణ.. అవసరం.. వాంఛ.. వీటి మధ్య ఉన్న సున్నితమైన గీతను గుర్తించడంలో విఫలమవుతున్నారు. తమంతట తాముగా వెళ్లి జీవితాలను, తల్లిదండ్రుల ఆశలను ఛిద్రం చేసే వలకు చిక్కు తూ..చిక్కుముడుల సుడిగుండంలో ఇరుక్కుంటున్నారు. తీరా సున్నితమైన గీత దాటామని గ్రహించే సరికి జీవి తాలు వేరొకరి వాంఛల గుప్పిట్లో బందీలవుతున్నాయి. బంధువు లు సైతం కీచకులుగా మారుతున్నారు. 'మంచి స్పర్శ - చెడు స్పర్శ' అని ఎంత బోధిస్తున్నా ఫలితాలు పెద్దల రోదనలకు సమాధానం చెప్పలేకపోతున్నాయి.

6 వేల మంది చిట్టిగర్భవతులు

బాలికలు కౌమార దశలో గర్భం దాల్చుతూ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. 15 నుంచి 18 ఏళ్లలోపు వాళ్లు 2023 నుంచి ఇప్పటి వరకూ 6 వేల మంది గర్భం దాల్చారనే గణాంకాలు సమాజాన్ని హెచ్చరిస్తున్నాయి. 2016 నుంచీ గత డిసెంబరు వరకూ మిస్సింగ్ కేసులు పరిశీలిస్తే.. ఉమ్మడి, విభజిత తూర్పుగోదావరిలో బాలలు 21, బాలికలు 70 మంది ఉన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటికే పదుల సంఖ్యలో పోక్సో కేసులు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 12 ఏళ్లలోపు 45, 16 ఏళ్ల లోపు 35, 18 ఏళ్లలోపు బాలికలు 20 మంది తప్పిపోవడం లేదా ఇళ్ల నుంచి వెళ్లిపోవడం జరిగింది. గతేడాది 18ఏళ్ల పైబడిన వారిపై 23, 18 ఏళ్ల లోపు అంటే పిల్లలపై 43 అత్యాచార కేసులు నమోదయ్యాయి.ఈ 43 కేసుల్లో ఓ ఏడు తప్పా.. 36 ప్రేమ పేరుతో పరారైనవే కావడం గమనార్హం. ఇక ఆ 23 కేసుల్లో నాలుగు తప్పా మిగతా వాటిలో పెళ్లి చేసుకుంటామని చెప్పినవి ఉన్నాయి. ఈ ఏడాది ఉమ్మడి తూర్పుగోదావరిలో ఇప్పటి వరకూ వందకుపైగా బాలి కలపై అత్యాచారం కేసుల సంఘటనలు ఉన్నాయి.

పెరుగుతున్న అత్యాచార కేసులు
బలైపోతున్న బాలికలు
అవగాహన లేక మోసపోతున్నారు

తల్లిదండ్రుల అప్రమత్తతే శ్రీరామరక్ష

తల్లిదండ్రుల అప్రమత్తత, ప్రవర్తనే పిల్లల పాలిట శ్రీరామరక్ష. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల నిఘా కచ్చితంగా ఉండాలి. తమ పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారు? ఎవ రితో ఎక్కువగా మాట్లాడుతున్నారు? స్కూలు/కాలేజీకి వెళ్లేటప్పుడు విద్యార్థినులేం చేస్తున్నారు? దారి మధ్యలో పెత్తనాలు ఏవైనా చేస్తున్నారా ఇలాంటి విషయాలన్నీ గమనించాలి. హాస్టళ్లలో ఉండే తమ ఆడపిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత వారిదే. హాస్టళ్లలో పరిస్థితులు, తమ చిన్నారి ఎలా ఉంటోంది అనే విషయాలపైనా ఆరా తీయాలి. ముఖ్యంగా తమకు దూరంగా ఉండే పిల్లలతో ప్రేమగా మెలగాలి. వారి మనసులో బాధను తెలుసుకోవాలి. ఏం జరిగినా తమకు చెప్పాలనే భరోసా తల్లిదండ్రులు కల్పించాలి. తాము ఉన్నామనే ధైర్యం ఇవ్వాలి. సాధారణంగా 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ ఉరకలు వేసే వయసు కావడంతో దారితప్పే అవకాశం ఎక్కువ.అందువల్ల తల్లిదండ్రులు గమనిస్తుండాలి. పాఠశాలల్లో టీచర్ల వ్యవహారశైలి.విద్యార్థినులతో ప్రవర్తన గమనించాలి.

అధికారులేం చేస్తున్నారు..

ఇటీవల పోలీస్‌శాఖ, చైల్డ్ వెల్ఫేర్, ప్రొటెక్షన్ సెల్ ఆధ్వర్యంలో పాఠశాలలు,కళాశాలల్లో గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. పోక్సో చట్టం, ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులకు పాల్పడేవారికి విధించే శిక్షలు, అపరిచిత వ్యక్తులతో పాటు చుట్టుపక్కల సమాజంలో ఎలా మెలగాలి అనే విషయాలపైనా న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నారు. లైంగిక వేధింపులు, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే 100కు ఫోన్ చేసి తల్లిదండ్రులు సమాచారం ఇవ్వాలి.. జాప్యం జరిగే పరిస్థితి విషమించే అవకాశం ఉంది.

పిల్లల ప్రవర్తన గమనిస్తుండాలి

పిల్లల ప్రవర్తన తల్లిదండ్రులు గమనిస్తుండాలి.. సెల్‌ఫోన్ ఇస్తే నిఘా ఉండాలి. సోషల్ మీడియా ఎలా ఉపయోగిస్తున్నారనే విషయం పరిశీలించాలి. హెయిర్ కటింగ్, నడవడిక, దుస్తులు వంటివి మంచిగా ఉండేట్లు చూసుకోవాలి. ఆడపిల్లలు ఒకవేళ ఎవరి ట్రాప్‌లో అయినా ఉండి మాట వినకపోతే వెంటనే పోలీసులకు చెప్పాలి. మేం కౌన్సె లింగ్ ఇస్తాం. వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. స్కూలులో పిల్లలకు నైతిక విలువలు, మంచి నడవడిక గురించి నూరి పోస్తుండాలి.అందరం కలిసి ఆడపిల్లలను రక్షిద్దాం.

- డి.నరసింహ కిశోర్, ఎస్పీ, తూర్పుగోదావరి



నైతిక విలువలు పెంచండి

తల్లిదండ్రులు పిల్లల ర్యాంకుల చుట్టూ పరుగులు పెడుతున్నారు. నైతిక విలువలు చెప్పే వారు లేరు. ఆ తరగతి గదులూ మాయమయ్యాయి. ఇవన్నీ కలిసి పిల్లలు నడిచే తీరును వక్రమార్గంలోకి తీసుకెళు తున్నాయి. విద్యా విధానంలో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహభావంతో మెలగాలి. నీతి కథ లు, జీవితంపై చెడు చూపించే ప్రభావం, కుటుంబ విలువలు నూరిపోయాలి.

- డాక్టర్ కర్రి రామారెడ్డి, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు





చిన్నారులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీవిద్య

చిన్నారుల కిడ్నాప్ కలకలం

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఇద్దరు చిన్నపిల్లలు కిడ్నాప్‌కు గురైనట్టు కలకలం రేగింది. రాజమమహేంద్రవరం వీఎల్ పురం సమీపంలో పిరమిడ్ సమీపంలో అపార్టుమెంట్ వద్ద అన్నాచెల్లెలు భాను ప్రసాద్(7), మోహన(5) ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఆడుకుంటున్నారు. కొద్దిసేపటికి తల్లి అపార్ట్‌మెంట్ బయటకు వచ్చి చూస్తే పిల్లలిద్దరు కనిపించలేదు. దీంతో కంగారు పడి అటూ ఇటూ చూసి పిల్లలను ఎవరో ఎత్తుకుపోయారని భావించింది. భయంతో చుట్టుపక్కల వారికి చెప్పడంతో కొంత మంది సోషల్ మీడియాలో రకరకాల పోస్టింగ్‌లు పెట్టేశారు. బాలల తల్లి ఫోన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇటు ప్రకాశ్‌నగర్ పోలీసులు అటు బొమ్మూరు పోలీసులు వెంటనే అప్రమత్తమై సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డీఎస్పీ శ్రీవిద్య ఆధ్వర్యంలో అపార్ట్‌మెంట్ వద్ద సీసీ కెమెరాలు పరిశీలించి ఆ పిల్లలు ఆడుకుంటూ పక్క వీధిలోకి వెళ్లినట్టు గుర్తించి అటువైపు వెళ్లి చూస్తే పిల్లలిద్దరు ఆడుకుంటూ కనిపించారు.ఆ పిల్లలను తీసుకుని వారి తల్లికి డీఎస్పీ శ్రీవిద్య అప్పగించి పిల్లల పట్ల జాగ్రత్తలు చెప్పారు.

ఒడ్డున.. పడుతున్నారు!



నేటి నుంచి మళ్లీ ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో 212 కేంద్రాల ఏర్పాటు
- 5.31 లక్షల టన్నుల దిగుబడి
- 4 లక్షల టన్నులు సేకరణ
- తుఫాన్ దెబ్బకు రైతుకు నష్టం
- కొనుగోలు కేంద్రాలతో ఊరట

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులను మొంథా తుఫాన్ దెబ్బతీసింది. ప్రభుత్వం ఇటీవల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా తుఫాన్ వల్ల ఇబ్బంది ఏర్పడింది.మంత్రి కందుల దుర్గేష్ ఇటీవల నిడదవోలు నుంచి జిల్లాలోని కొనుగోలు కేంద్రాలను లాంచనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. కానీ తుఫాన్ వల్ల కొనుగోలు ఆలస్యమైంది. జిల్లాలో చాలా పంట వాన నీటిలో మునిగిపోయింది. కొంత మేర రైతులు అయినకాడకు ధాన్యం అమ్మేసుకున్నారు. మిగిలిన ధాన్యం సోమవారం నుంచి పౌర సరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు చేయనుంది. రాజమహేంద్రవరం డివిజన్‌లో 93, కొవ్వూరు డివిజన్‌లో 119 మొత్తం జిల్లాలో 212 కేంద్రాలు ఏర్పాటు చేశారు.144 మిల్లుల ద్వారా కొనడానికి ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే రూ.135 కోట్ల బ్యాంక్ గ్యారంటీ కూడా లభించింది.

4 లక్షల టన్నుల సేకరణ

గతంలో కంటే ఎక్కువ ధాన్యం సేకరించడానికి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రతి ఏటా సాధారణంగా 2.5 మెట్రిక్ టన్నుల నుంచి 3 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం సేకరించేవారు. దీంతో చివరలో రైతులు ఇబ్బందిపడేవారు. రబీ సీజన్‌లో రైతులు ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ ద్వారా రబీలో మంచి ధరకు కొనుగోలు చేయ డంతో పాటు 24 గంటల్లోనే నగదు కూడా రైతు ఖాతాల్లో జమచేయడంతో రైతులు ప్రభుత్వానికే అమ్మాలనే ఆలోచనతో ముందుకొచ్చారు. దీంతో చివరి పంట రైతులు ఇబ్బంది పడ్డారు. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం రైతుల నుంచి ఈ సీజన్‌లో ఎక్కువ ధాన్యం కొనుగోలుకు నిర్ణయించింది.జిల్లాలో మొత్తం 5.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా. అందులో 4 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సీఎంఆర్‌కు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు.

74,793 హెక్టార్లలో ఖరీఫ్..

జిల్లాలోని 18 మండలాల పరిధిలో 74, 793 హెక్టారల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేశారు. ఇప్పటి వరకూ 9657.48 హెక్టార్లలో వరి కోతలు పూర్తయ్యాయి. డిసెంబరు 15వ తేదీ వరకూ కోతలు జరిగే అవకాశం ఉంది. కనీస మద్దతు ధర ప్రకారం కామన్ వెరైటీ క్వింటా ధాన్యానికి రూ. 2369, గ్రేడ్-ఎ రకానికి రూ.2389 ఇవ్వాల్సి ఉంది. కానీ రైతులు 17 శాతం తేమ వరకూ ధాన్యాన్ని ఆరబెట్టవలసి ఉంది. గోనె సంచుల వినియోగచార్జీలు, కూలీల చార్జీలను ప్రభుత్వమే భరిస్తుంది. క్వింటాకు గోనె సంచుల వినియోగచార్జీ రూ.4.74, కూలీల చార్జీ రూ.22 వరకూ ప్రభుత్వం ఇస్తుంది. మద్దతు ధరతో ఈ చార్జీలకు సంబంధం లేదు. తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతాంగం మాత్రం తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

తుఫాన్ నష్టం లెక్కింపు..

జిల్లాలో మొంథా తుఫాన్ నేపధ్యంలో నష్టపోయిన పంట లెక్కింపులో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే 99.77 శాతం ఎన్యూమరేషన్ పూర్తయింది. జిల్లాలో 16, 843 మంది రైతులకు సంబంధించిన 25,444 చేలను అధికారులు సర్వే చేశారు. ప్యాడీ క్రాప్ డ్యామేజీ రిపోర్టు(పీసీడీఆర్) అందజేశారు. అందులో ఇప్పటి వరకూ 8641.40 హెక్టార్లలో ఎన్యుమరేషన్ పూర్తిచేశారు. తాళ్లపూడి, గోపాల పురం, కడియం, రాజమండ్రి రూరల్, నల్లజర్ల, బిక్కవోలు మండలాల్లో పూర్తయింది. మిగిలినది పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు.



దేవుడి చెరువు చుట్టూ కూర్చుని తెప్పోత్సవం తిలకిస్తున్న భక్తజనం



హంస వాహనంపై ఊరేగుతున్న కోరుకొండ లక్ష్మీ నరసింహస్వామి

తిలకించారు.. పులకించారు!
వైభవంగా కోరుకొండ లక్ష్మీ నృసింహుడి తెప్పోత్సవం

కోరుకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పవిత్రకార్తీక మాసం క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా ఆదివారం రాత్రి హంస వాహనంపై కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవుడి కోనేటిలో విహరించారు. అంతకు ముందు స్వామివారిని ప్రత్యేక పల్లకీలో ఆశీనులు గావించి దిగువ దేవస్థానం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య కిలోమీటరు దూరంలో ఉన్న దేవుడి కోనేరు వద్దకు చేర్చారు. అక్కడ దేవుడి కోనేటిలో సిద్ధంగా ఉంచిన హంస వాహనంపై లక్ష్మీనరసింహస్వామి ఆశీనులు గావించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్ స్వామి ఆధ్వర్యంలో పెద్దింటి, పెరవలి, పెదపాటి అనువంశిక అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి హంస వాహనం దేవుడి కోనేటిలో మూడు సార్లు విహరించారు. కన్నుల పండువగా జరిగిన ఈ తెప్పోత్సవాన్ని కోరుకొండ పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు తిలకించి.. పులకించారు.తెప్పోత్సవం అనంతరం ప్రత్యేక వేదికపై శ్రీ లక్ష్మీనరసింహస్వామిని ఆశీనులను గావించి సేవాకాలం నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు, రాజానగరం ఏఎంసీ చైర్మన్ తనకాల వెంకటరమణ, నాగేశ్వరరావు దంపతులు, కోరుకొండ సర్పంచ్ లక్ష్మీసరోజవీరగణేష్ దంపతులు పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నయనానందకరం.. నౌకావిహారం

● పంపా సరోవరంలో ఘనంగా సత్యదేవుడి తెప్పోత్సవం ● తరించిన భక్తజనం



తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, భక్తులు







స్వామి,అమ్మవార్లను తీసుకొచ్చి హారతి ఇస్తున్న పండితులు, నృత్య ప్రదర్శన

అన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న రత్నగిరివాసుడైన సత్యదేవుడి నౌకావిహారం ఆదివారం భక్తజనుల గోవిందనామస్మరణల నడుమ నయనానందకరంగా జరిగింది. అనంతలక్ష్మి సమేతుడైన స్వామి పచ్చనికొండల నడుమ పంపా హోయలలో హంసవాహనంపై ముమ్మారు విహరించగా ప్రకృతి పరవశించింది. విద్యుద్దీపఅలంకరణలు, కళ్లు మిరుమిట్లు గొలిపే బాణాసంచా కాల్పుల నడుమ ఆహ్లాదభరిత వాతావరణంలో ఈ కమనీయ వేడుక ఘనంగా జరిగింది. సాయంత్రం 5గంటలకు కొండపై నుంచి స్వామి,అమ్మవార్లను.. క్షేత్రపాలకులైన సీతారాములను పల్లకీలో ఘాట్‌రోడ్డు గుండా బాజాభజంత్రీలు, వేదమంత్రాల నడుమ పంపాసరోవర తీరంవద్దకు తోడ్కొనివచ్చారు. వివిధ సుగంధ భరిత పుష్పమాలికలతో తీర్చిదిద్దిన ప్రత్యేక వేదికపై సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను, మరో వేదికపై సీతారాములను ఆశీనులు గావించి పండితులు వేదస్వస్తితో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు చామర్తి వెంకటరెడ్డి పంతులు, పాలంకి పట్టాభి తదితరులు గణపతిపూజ, పుణ్యాహవచనం శ్రీసూక్త, పురుషసూక్త విధానంలో కృతువు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక వద్ద అర్చకస్వాములు తులసిధాత్రి పూజను జరిపించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి,అమ్మవార్లను పంపాతీరం వద్ద ప్రత్యేకంగా తయారుచేయించిన హంస వాహనంపైకి తీసువెళ్లి మరోమారు పూజలు అనంతరం 3పర్యాయాలు పంపా సరోవరంలో నౌకావిహారం గావించారు. అనంతరం చతుర్వేదపండితులు మహాదాశీర్వచనం అందజేయగా భక్తులకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు.

ఆనవాయితీగా వేడుక...

ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు పాలకడలిలో శయనించి భాద్రపద ఏకాదశి (పరివర్తన ఏకాదశి) రోజున ఒకపక్కకు ఒదిగుతారు కార్తీకమాసంలో వచ్చే క్షీరాబ్ధిద్వాదశి రోజున శ్రీ మహావిష్ణువు మేల్కొనడానికి ప్రతీకగా విష్ణస్వరూపుడైన సత్యదేవుడికి ఈ వేడుకను జరపడం ఆనవాయితీగా వస్తుంది.

ప్రత్యేక ఏర్పాట్లు

సాధారణ భక్తులు తిలకించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేయగా ప్రముఖులు నౌకావిహారం చూసేందుకు తీరం వద్ద ప్రత్యేక గ్యాలరీ, భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టగా పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆదేశాలతో ప్రత్తిపాడు సీఐ, అన్నవరం ఎస్ఐ బందోబస్తు నిర్వహించారు. ప్రవాహం ఎక్కువగా ఉండడంతో హంస వాహనంపైకి ముందుగా అనుకున్న 18 మంది వైదికబృందాన్ని 12 మందికి కుదించారు. ముందుజాగ్రత్త చర్యగా పంపా సరోవరంలో హంస వాహనం తిరిగే దూరాన్ని తగ్గించారు.

సత్యదేవుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు

6200 జంటలు సత్యవ్రతాలు రూ.65 లక్షల ఆదాయం



సత్యదేవుడి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

అన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో కార్తీకమాస రద్దీ ఆదివారం కొనసాగింది. సెలవుదినం, క్షీరాబ్దిద్వాదశి పర్వదినం కావడంతో అశేషసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒం టిగంట నుంచి వ్రతాలు, 2గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. ఉదయం 9 గంటలవరకు సాధారణంగా ఉన్న భక్తజనం 9 దాటిన తరువాత పోటెత్తారు. భక్తులకు ఎటువంటి అ సౌకర్యం కలగకుండా చైర్మన్ ఐవీ రోహిత్ పశ్చిమరాజగోపురం లిఫ్ట్ వద్ద, ఈవో వీర్ల సుబ్బారావు కమాండ్ కంట్రోల్ రూంలో ఉండి పర్యవేక్షించారు. రద్దీ ఆధారంగా అంత్రాలయ దర్శనానికి అనుమతించారు. స్వామివారి ప్రత్యేకదర్శనానికి 2గంటలు, ఉచిత దర్శనానికి 3గంటల సమయం భక్తులు వేచిఉన్నారు. ఆదివారం 6200 జంటలు వ్రతాలాచరించుకోగా వివిధ విభాగాల ద్వా రా సుమారు రూ.65 లక్షల ఆదాయం లభించింది. కార్తీక సోమవారం భక్తుల రద్దీకణుగుణంగా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఘనంగా సత్యజ్యోతి ఊరేగింపు

క్షీరాబ్దిద్వాదశి పర్వదినం పురస్కరించుకుని ఆదివారం ఉదయం సత్యజ్యోతి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్లను గ్రామశివారున ఉన్న సుబ్బరాయపురం సాక్షిగణపతి ఆలయం వద్దకు తీసుకుని వెళ్లి ప్రత్యేక పూజలు అనంతరం అక్కడ వెలిగించిన సత్యజ్యోతిని గ్రామంలో సత్యదీక్షాపరులు, అయ్యప్పమాలధారులతో గోవిందనామస్మరణల నడుమ ఊరేగింపు నిర్వహించి కొండపై కళామందిరంలో సత్యజ్యోతిని భక్తుల కోసం ఉంచారు.



సత్యజ్యోతి ఊరేగింపు నిర్వహిస్తున్న ఈవో, అర్చకులు

'లోవ'లో భక్తుల కోలాహలం

ఆలయానికి రూ.1.48 లక్షల ఆదాయం



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు



క్యూలో బారులు తీరిన భక్తులు

తుని రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ప్రత్యేక క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లో గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబసమేతంగా భోజనాలు చే శారు. ఆలయానికి రూ.1.48 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో విశ్వనాధ్ రాజు తెలిపారు.

వైభవంగా క్షీరాబ్ధి ద్వాదశి వేడుకలు

గోదావరిలో విహరించిన వాడపల్లి వెంకన్న

ఆత్రేయపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక ఆదివారం క్షీరాబ్ధి ద్వాదశి (చిలుకు ద్వాదశి) వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పల్లకీలో ఆధి రోహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి మేళతాళ మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి గౌతమి గోదావరి నదీలో హంస వాహనంలో కొలువుతీరిన స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష అర్చన, చతుర్వేద స్వస్తి అర్చక బృందం ఘనంగా నిర్వహించారు. శ్రీవారి హంస వాహనంలో గోదావరిలో మిరుగొట్లు గొలిపే విద్యుత్ కాంతుల నడుమ వేదమంత్రాల సాక్షిగా విహరించారు. అశేష భక్తజనం పాల్గొని తన్మయత్వం పొందారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పాల్గొన్నారు.





వాడపల్లిలో గౌతమి గోదావరిలో హంస వాహనంపై విహరిస్తున్న శ్రీవారు, పూజలు చేస్తున్న అర్చకులు

అంతర్వేదిలో తెప్పోత్సవం

అంతర్వేది, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసంహస్వామి వారి ఆలయంలో ద్వాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం కంచుగరుడ వాహనంపై స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి-అమ్మవార్లను ఊరేగింపుగా బాణసంచా కాల్పులు, కేరళ వాయిద్యాల నడుమ పల్లిపాలెం గ్రామంలోకి శాస్త్రోక్తంగా తీసుకెళ్లారు. వశిష్ట రేవులో తెప్పోత్సవం వైభవంగా జరిగింది. అంతర్వేది పల్లిపాలెం వశిష్ట రేవులో ప్రారంభమైన తెప్పోత్సవం గొంది గ్రామానికి చేరుకుని తిరుగు ప్రయాణంలో రాత్రి అంతర్వేదికి చేరుకుంది. అనంతరం ద్వాదశ మండపానికి చేరుకున్న స్వామి,అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొన్నారు.



అంతర్వేది వశిష్ట రేవులో హంస వాహనంపై స్వామివారికి తెప్పోత్సవం





పిఠాపురం-గొల్లప్రోలు మధ్య ఏలేరు కాలువకు పడిన గండ్ల నుంచి వరద ప్రవాహం, ముంపులో వరి చేను

తగ్గుతున్న 'ఏలేరు' వరద

» అవుట్‌ఫ్లోస్ 3,175 క్యూసెక్కులు

» ఇంకా ముంపులోనే పంట పొలాలు

పిఠాపురం/ ఏలేశ్వరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏలేరు వరద ఉధృతి తగ్గుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి రిజర్వాయర్‌లోకి వస్తున్న ఇన్‌ఫ్లోస్ తగ్గడంతో ఆ మేరకు అవుట్‌ఫ్లోస్‌ను తగ్గించారు. అయితే పంట పొలాల్లో మాత్రం వరద నీరు కొనసాగుతోంది. నీరు తగ్గేందుకు మరో రెండు, మూడు రోజులు పడుతుందని రైతులు చెప్తున్నారు.

ఏలేరు రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు తగ్గడంతో దిగువకు వరద జలాల విడుదలను 3,175 క్యూసెక్కులకు పరిమితం చేశారు. దీంతో ఆదివారం సాయంత్రం వరద ఉధృతి తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. శనివారం వరకు 6,175 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లోస్ ఆదివారం ఉదయం 6 గంటలకు 4,806 క్యూసెక్కులకు తగ్గగా, 9 గంటలకు 3,145 క్యూసెక్కులు, 11 గంటలకు 2,935 క్యూసెక్కులు, సాయంత్రం 4 గంటలకు 1,687 క్యూసెక్కులు, 6 గంటలకు 1,784 క్యూసెక్కులుగా ఉన్నాయి. ఆదివారం ఉదయం 6 గంటలకు 6,175 క్యూసెక్కులుగా ఉన్న అవుట్‌ఫ్లోస్‌ను సాయంత్రానికి 3,175 క్యూసెక్కులకు తగ్గించారు. స్పిల్‌వే ద్వారా 2,400, డీసీఆర్ స్లూయిస్ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని కాలువలకు విడుదల చేస్తుండగా, విశాఖ అవసరాలకు 1750 క్యూసెక్కులు పంపుతున్నారు. ఏలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం 85.63 మీటర్లు ఉండగా, నీటి నిల్వలు 22.22 టీఎంసీలు ఉన్నాయి.



ఏలేరు జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

ఏలేరు రిజర్వాయర్ నుంచి విడుదల చేసున్న నీటి ప్రవాహం పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లో ఉధృతంగానే ఉంది. కాలువలకు పలుచోట్ల గండ్లు పడడంతో వాటి నుంచి వస్తున్న వరద నీరు పంట పొలాల్లోకి చేరుతోంది. ఫలితంగా వరి చేలల్లో నీరు ఇంకా అలాగే ఉంది. పూర్తిస్థాయిలో తగ్గేందుకు మూడు రోజుల సమయం పడుతుందని రైతులు తెలిపారు. వరద ఉధృతికి కాలువలు పలుచోట్ల కోతకు గురికావడంతో పాటు గండ్లు పెద్దవిగా మారుతున్నాయి. వీటిని తక్షణం పూడ్చేందుకు చర్యలు చేపట్టకపోతే ముంపు తగ్గదని చెప్తున్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పోలీసులు

కాకినాడ క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ మహిళా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక ఎస్ఐ, మరో కానిస్టేబుల్ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. కాకినాడ డైరీఫారం సెంటర్‌కు చెందిన ఓ మహిళ వైవాహిక జీవితంలో చోటుచేసుకున్న వివాదాలతో తన భర్తపై గత నెల 13న గ్రీవెన్స్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఎస్పీ దర్యాప్తు చేపట్టి బాధితురాలికి న్యాయం చేయాలని మహిళా పోలీసులకు సిఫార్సు చేశారు. కేసు విచారణను ఎస్ఐ వాడపల్లి ఆంజనేయరాజు చేపట్టారు. ఈ క్రమంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న భర్తకు అండగా నిలిచాడు. కేసు విచారణ తాను చూసుకుంటానని భరోసా ఇచ్చి అతడి నుంచి రూ.20వేలు లంచం వసూలు చేశాడు. ఈ మొత్తాన్ని అక్కడే పనిచేస్తున్న కానిస్టేబుల్ జుత్తుక శ్రీనివాసరావు అందుకుని ఎస్ఐకు అందజేశాడు. ఈ ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాన్ని బాధితురాలు ప్రత్యక్షంగా చూసింది. అనంతరం ఆమె ఎస్పీని ఆశ్రయించి జరిగిన విషయాన్ని ఫిర్యాదు రూపంలో ఇచ్చింది. ఈ వ్యవహారంపై ఎస్పీ అంతర్గత విచారణ చేపట్టారు. వాస్తవాలు నిగ్గుతేలడంతో ఎస్ఐ, కానిస్టేబుల్‌లను బదిలీ చేసేందుకు సిద్ధమయ్యారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

దేవరపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెనుక నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొనడంతో మోటారు సైకిస్టు దుర్మరణం చెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం రంగరాయ కాలనీకి చెందిన షేక్ ఇమామ్ (50) రాళ్లు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పనిమీద బైక్‌పై బయల్దేరాడు. ఏలూరు నుంచి కొవ్వూరు వైపు వెళ్తున్న అతడిని మండలంలోని దుద్దుకూరు సమీపంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా నిర్లక్ష్యంగా వచ్చిన వ్యాన్ ఢీకొంది. కిందపడిన ఇమామ్ తల డివైడర్‌కు తగలడంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే కన్నుమూశాడు. అతడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం చెప్పారు.



మృతుడు షేక్ ఇమామ్ (పాత చిత్రం)

రంగంలోకి నాలుగు ప్రత్యేక బృందాలు

కొంకాపల్లికి చెందిన శ్రీను హత్య కేసులో నిందితుల కోసం విస్తృత గాలింపు

పోలీసుల అదుపులో నలుగురు ప్రధాన నిందితులు: సోషల్ మీడియాలో ప్రచారం

అమలాపురం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ (37) హత్య కేసును ఛేదించేందుకు ఎస్పీ రాహుల్‌మీనా పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించారు. శ్రీనివాస్‌ను అతి కిరాతకంగా హత్య చేసిన అనంతరం ప్రధాన నిందితులు అదే రోజున దేశంలోని వివిధ ప్రధాన ప్రాంతాలకు వెళ్లిపోయినట్టు పోలీసులు గుర్తించారు. తమిళనాడు, ఉత్తరప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో కీలక ప్రాంతాల్లో ఉన్న నలుగురు ప్రధాన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అయితే తాము ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని పోలీసులు చెప్తున్నారు. శ్రీనివాస్ హత్య అనంతర పరిణామాలపై పట్టణ పోలీసులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అయితే ఈ కేసులో ప్రధాన నిందితులు పోలీసుల అదుపులోకి చేరినట్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. స్వామిమాలలో ఉన్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదివారం మృతుడు శ్రీనివాస్ భార్య దేవితో ఫోనులో మాట్లాడి ధైర్యం చెప్పారు. హత్యకు కారకులైన వారిని అరెస్టు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇదిలా ఉండగా పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లి గోదావరిలో లభ్యమైన శ్రీనివాస్ మృతదేహానికి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. నివేదిక ఇంతవరకు అందలేదని, దాని ఆధారంగా కేసులో దర్యాప్తును కీలకంగా మార్చుకునే అవకాశం ఉంటుందని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

ఈలకొలనులో వ్యక్తిపై హత్యాయత్నం: ఐదుగురి అరెస్టు

రంగంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం ఈలకొలనులో ఒక వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో ఐదుగురిని అరెస్టు చేశారు. రంగంపేట ఎస్ఐ ఎస్.శివప్రసాద్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం... రంగంపేట మండలం ఈలకొలనుకు చెందిన నులుకుర్తి వీరలక్ష్మి తన పేరిట వున్న సుమారు 9 ఎకరాల పామాయిల్ తోటను కాకినాడ జిల్లా కరప మండలం వేళంగికి చెందిన తన తండ్రి టేకుమూడి వీర వెంకట సత్యనారాయణకు ఈ ఏడాది ఆగస్టులో రిజిస్ట్రేషన్ చేయించింది. ఈ నెల ఒకటో తేదీన ఆయన కొంతమంది పనివాళ్లను, మనుమడిని తీసుకుని పామాయిల్ తోటలోకి వెళ్లి గెలులు కోయించాడు. వాటిని ట్రాక్టర్లోకి ఎక్కిస్తుండగా రాజానగరం మండలం సూర్యారావుపేటకు చెందిన దొండపాటి దుర్గ, కొవ్వూరి సత్యనారాయణ, కొవ్వూరి బాబి, యాళ్ల రామారావు, రాధేయపాలేనికి చెందిన మేడిశెట్టి నరసింహమూర్తి అడ్డుకున్నారు. ఈ తోట నులుకుర్తి ముత్యమాధురి, సాల్మన్‌రాజులకి చెందినదని, ఇందులో మీరు ఎందుకు గెలలు కోస్తున్నారని పై ఐదుగురు ప్రశ్నించారు. గెలలు కోయడానికి ఎవరైనా వస్తే వారి అంతు చూడాలని తమతో చెప్పారన్నారు. ముందుగా తెచ్చుకున్న కర్రలతో టేకుమూడి సత్యనారాయణను చంపేందుకు ప్రయత్నిస్తుండగా ఆయన మనువడు, స్నేహితులు అడ్డుకోవడంతో త్రుటిలో తప్పించుకున్నారు. మూడు నెలల క్రితం పై వ్యక్తులు వేళంగిలోని తన ఇంటికి వచ్చి తనను, తన కుమారైను చంపేస్తామని బెదిరించారన్నారు. శనివారం హత్యాప్రయత్నం చేశారని రంగంపేట పోలీస్ స్టేషన్లో బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దొండపాటి దుర్గ, కొవ్వూరి సత్యనారాయణ, కొవ్వూరి బాబి, మేడిశెట్టి నరసింహమూర్తి, యాళ్ల రామారావులను అరెస్టు చేశారు. మిగిలిన వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని ఎస్ఐ చెప్పారు.

సహచరుడి మరణం కలచివేసింది

రాష్ట్ర స్థాయి అవార్డును నిరాకరించిన విద్యుత్ శాఖ ఏఈ ప్రసాద్



అంతర్వేది/మలికిపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మండలం సఖినేటిపల్లి మండలంలో వందలాది విద్యుత్ స్తంభాలు విరిగిపడి వాటిపై కొబ్బరిచెట్లు పడిపోయాయి. వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించి 24 గంటల్లోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. తుఫాన్ సహాయ చర్యల్లో కష్టపడిన విద్యుత్ శాఖ సఖినేటిపల్లి, మలికిపురం మండలాల ఏఈ బొలిశెట్టి ప్రసాద్‌ను రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక చేశారు. ముఖ్యమంత్రి నుంచి అవార్డు తీసుకునేందుకు ఆయన అమరావతి వెళ్లలేదు. దీనిపై ఏఈని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో తన పర్యవేక్షణలో పనిచేసిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్ యడ్ల శంకర్ ప్రమాదవశాత్తు మృతి చెందడం తనను కలచివేసిందని, తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయన్నారు. అతడి కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్నప్పుడు అవార్డు తీసుకునేందుకు తన మనసు అంగీకరించలేదని ఏఈ చెప్పారు.



మత్స్యకారులకు చిక్కిన చేపలు

సూర చేపలివిగో...

ఉప్పాడ తీరంలో రూ.70 లక్షలు విలువైన మత్స్య సంపద లభ్యం

కొత్తపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో మత్స్యకారులకు సూర చేపలు లభ్యమయ్యాయి. ఇటీవల వరుస తుఫాన్లతో వారు ఇళ్లకే పరిమితమయ్యారు. మొంథా తుఫాన్ అనంతరం ఆదివారం వేటకు వెళ్లిన వారికి రూ.70 లక్షలు విలువైన సూర చేపలు దొరికాయి. దీంతో ఆనందం వ్యక్తం చేశారు.

ఎవరీ యువతి!

ముమ్మిడివరం పరిసరాల్లో సంచారం



ముమ్మిడివరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిసర ప్రాంతాల్లో గుర్తు తెలియని యువతి సంచరిస్తోంది. ఆమెకు మతిస్థిమితం లేదని స్థానికులు చెప్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్ల వెంబడి తిరుగుతోందని, గుర్తిస్తే సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయాలని కోరుతున్నారు. అసలే పరిస్థితులు బాగోలేని దృష్ట్యా ఒంటరిగా తిరుగుతున్న యువతిని కాపాడేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.



బస్టాపా.! ఆటోస్టాండా?

రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి ఎదురుగా బస్ స్టాపు ఉంది. అయితే ఈ షెడ్డులో కుర్చీలు ఉన్నా కూర్చోడానికి వీల్లేని పరిస్థితి. ఇక బయట నుంచుందామంటే ఆటోలు చుట్టు ముడుతున్నాయి. బస్టాప్ పక్కనే ఆటోలను వరుసగా బస్టాప్ వరకూ పెడుతున్నారు. ఆటోలను బస్టాప్ వద్ద నిలుపుతున్నారు. దీంతో బస్సులు ఆగడానికి తీవ్ర ఇబ్బందిగా ఉండడంతోపాటు ప్రమాదాలకు అవకాశంగా పరిస్థితి ఉంది. చాలా బస్సులు ఆగడం లేదు. దీంతో జనానికి ఆటో ఎక్కడం తప్పడం లేదు. ఇలా ఆస్పత్రికి వచ్చే పేదలు దోపిడీకి గురవుతున్నారు. ఉదాహరణకు కొందరు ఆర్టీసీ కాంప్లెక్స్‌కి వెళ్లి వాళ్ల ఊరికి వేరే బస్సు ఎక్కాల్సి ఉంటుంది. ఆర్టీసీ బస్సుల్లో కాంప్లెక్స్ వరకూ వెళ్లితే రూ.10 అవుతుంది. మహిళలకు అయితే ఉచితం. అయితే బస్సులు ఆగకుండా ఆటోలు తిప్పవేస్తూ కాంప్లెక్స్‌కి రూ.50 లాగేస్తున్నారు. ఇక్కడ ఆటో స్టాండును గాడిలో పెట్టి.. బస్ స్టాప్ వద్ద బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)

కడు దయనీయం

- కానరాని సిమెంట్ రోడ్డు
- తాగునీటి సరఫరా అస్తవ్యస్తం
- మచ్చుకైనా కనిపించని డ్రైనేజీలు
- వీధిలైట్లు అంతంత మాత్రమే
- గుమ్మళ్లదొడ్డి శివారులో జగనన్న కాలనీ దుస్థితి



గుమ్మళ్లదొడ్డిలో అంతర్గత రహదారులు కూడా లేని జగనన్న కాలనీ, కుళాయి



గోకవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో గుమ్మళ్లదొడ్డి గ్రామ శివారున ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్ పరిస్థితి కడు దయనీయంగా మారింది. వెదురుపాక, గుమ్మళ్లదొడ్డి, బావాజీపేట గ్రామస్థులకు ఈ ప్రాంతంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. మొత్తం ఇక్కడ 137 ఇళ్లు మంజూరు చేయగా 62 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే అతికష్టం మీద పూర్తయ్యాయి. సుమారు 26 ఇళ్లు పునాది దశలో నిలిచిపోగా, మిగిలినవి ఇప్పటికీ ప్రారంభించలేదు. వైసీపీ ప్రభుత్వ సమయంలో ఏర్పాటైన ఈ కాలనీలో సమస్యలు స్థానికులను వేధిస్తున్నాయి. కాలనీలో ఎక్కడా సీసీ రోడ్డు కానరావడం లేదు. తాగునీటి సరఫరా చాలా అస్తవ్యస్తంగా ఉంది. తాగునీరు ఎపుడు వస్తుందో, ఎంతసేపు వస్తుందో, ఎన్ని రోజులు పూర్తిగా వస్తాయో ఎవ్వరికీ తెలియదు. డ్రైనేజీలు మచ్చుకైనా కనిపించడంలేదు. వీధిలైట్లను అంతంత మాత్రంగానే ఏర్పాటు చేశారు.అవి కూడా సరిగా వెలగవని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇక చిన్నపాటి వర్షం కురిసినా ఆరోజు పనులన్నీ పక్కనబెట్టేసి ఇంట్లోనే తలదాచుకోవాలి. ఇంట్లోంచి బయట అడుగు పెడితే మోకాలు లోతు నీటిలోంచి నడవాల్సిందే. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు తోడు ఉంటేనే గాని ఆ బురద నీటిలోంచి విద్యార్థులను ఒంటరిగా పంపే సాహసం చేయడంలేదంటే ఇక్కడి పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనికితోడు విష సర్పాలు తిరుగుతున్నాయి.దీంతో రాత్రుళ్లు బయటకు వెళ్లేందుకు కాలనీవాసులు సాహసించడంలేదు. ఇళ్ల స్థలాల లబ్ధిదారుల్లో కొంతమంది ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలకు మరో రూ.2 నుంచి రూ.4లక్షల వరకు అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టారు. కానీ ఆ డబ్బులు పునాది వరకు మాత్రమే సరిపోవడంతో మిగిలిన నిర్మాణపు పనులను అలాగే వదిలేశారు. సంవత్సరాల తరబడి నిర్మాణాలను మధ్యలో నిలిపేయడం వల్ల ప్రస్తుతం ఆ ఇళ్లన్నీ ఏపుగా పెరిగిన తుప్పలతో నిండిపోయాయి. దాంతో దోమలు విస్తారంగా పెరిగిపోయాయని, రాత్రుళ్లు వాటితో సహవాసం సరిపోతుందని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. కనీస వసతుల లేమితో సతమతమవుతున్నా జగనన్న కాలనీల వైపు అధికారులు కనీసం కన్నెత్తి చూడడంలేదని వారు అంటున్నారు. కనీసం సర్పంచ్‌లు కూడా పట్టించుకోవడంలేదంటూ స్థానికులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



గ్రామం నుంచి జగనన్న కాలనీకి వచ్చే ప్రధాన రహదారి

వర్షమొస్తే పనులు మానుకోవాలి



మూడేళ్ల క్రితం ఇల్లు నిర్మించుకున్నాం. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు కాలనీ అంతా మునిగిపోతుంది. ఇంట్లో నుంచి కాలు బయటకు పెట్టలేం. ఆ రోజు పనులు మానుకొని ఇంట్లోనే ఉండాలి. దోమలు విస్తారంగా పెరిగి రాత్రుళ్లు కంటి మీద కునుకు ఉండడంలేదు. విష సర్పాల సంచారం కూడా ఎక్కువగానే ఉంది.

-కొప్పాక వెంకటలక్ష్మి, బావాజీపేట.

మా బాధలు తీరేలా లేవు



కాలనీ ఏర్పడి మూడేళ్లు దాటుతోంది. అప్పటి నుంచి సమస్యలు అలాగే ఉన్నాయి. డ్రైన్లు, తాగునీటి కుళాయిలు, వీధిలైట్లు, విద్యుత్ సరఫరా సక్రమంగా లేవు. సిమెంట్ రోడ్డు కనిపించదు. అధికారులు కన్నెత్తి చూడరు. ఈ జన్మకు ఇలాగే బతకాలేమో.

-బొత్తల లోవ, గుమ్మళ్ళదొడ్డి.

సర్దార్ వల్లబాయి పటేల్ జయంతి వారోత్సవాలు



వడిశలేరులో పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

రంగంపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడిశలేరు గ్రామంలో కోనేరు వినాయకుడి గుడి వద్ద రాజకీయ విశ్లేషకుడు అడబాల మరిడియ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయి పటేల్ 150వ జయంతి వారోత్సవాల్లో భాగంగా మూడో రోజున పటేల్ జయంతి సభ నిర్వహించారు.ఈ సభకు పోతుల బుల్లి వీర్రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మరిడియ్య మాట్లాడుతూ నేటి యవత, రాజకీయ నాయకులు పటేల్‌ను ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు.ఆయన గురించి ప్రతిఒక్కరికి తెలియజేయాలనే ఉద్దేశ్యంతోనే మండలంలో వారం రోజుల పాటు గ్రామాల్లో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని మరిడియ్య తెలిపారు.బుల్లివీర్రాజు మాట్లాడుతూ 565 సంస్థాలను దేశంలో కలిపిన సమైక్యతా వాది పటేల్ అని అన్నారు. కార్యక్రమంలో మావిరెడ్డి వీర్రాజు, నలమాటి దొరబాబు, కాకర్ల సాయి. ఉప్పలపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

వన సమారాధనలతో వనాల సంరక్షణ

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
పలుచోట్ల కార్తీక వనభోజనాలు



దుప్పలపూడిలో ఎమ్మెల్యే నల్లమిల్లికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

అనపర్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు ప్రకృతి ప్రసాదించిన వరం వనాలని, వాటిని సంరక్షించుకునేందుకే కార్తీక వన సమారాధనలు నిర్వహించుకుంటున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దుప్పలపూడిలో కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. రామకృష్ణారెడ్డితోపాటు టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అకేపాటి అమర్నాథరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం ఏర్పడిన నాటి నుంచి అధ్యక్షుడిగా ఉన్న కర్రి త్రినాథరెడ్డి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనపర్తిలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్ సాధించిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని విశాఖపట్నం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, చింతా గిరిబాల, సత్తి వీర్రెడ్డి, ఓబుల్‌రెడ్డిలను సత్కరించారు. కార్యక్రమం లో తాడి చంద్రశేఖరరెడ్డి, నల్లమిల్లి కాంతమ్మ, మాజీ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాశ రెడ్డి,సత్తి సూర్యనారాయణరెడ్డి,నల్లమిల్లి శేషారెడ్డి పాల్గొన్నారు.

టీకే ఆధ్వర్యంలో..

దివాన్‌చెరువు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం సంపత్‌నగరంలోని రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. ఆదివారం రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత పలు రకాల పూజలను స్వరూప్‌రెడ్డి, సత్యసౌందర్య దంపతులు చేశారు.అనంతరం జరిగిన వనసమారాధనకు రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, కడప ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి,మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆకుల వీర్రాజు, దొండపాటి సత్యంబాబు ముఖ్యఅతిథులుగా విచ్చేయగా వారిని టీకే సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటలపోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, రాష్ట్ర కిసాన్ సెల్ కాకర్ల హరిబాబు, దేవిరెడ్డి బలరాంనాయుడు, అరుణకుమారి, మేడవరపు భద్రందొర, జేటీ రామారావు, డాక్టర్ వడయార్, వడియార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కార్తీకమాసం రెండో ఆదివారం సందర్భంగా లాలాచెరువు సమీపంలోని గోదావరి మహాపుష్కర వనం కొంతమంది తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో వనభోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నాపెద్ద బేదం లేకుండా ఆడిపాడారు.



ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డిని సత్కరిస్తున్న విశ్వేశ్వరరెడ్డి

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



టీడీపీ క్రికెట్ టోర్నీ విజేతకు కప్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నగర టీడీపీ క్రికెట్ టోర్నమెంట్ తమ నాయకుల్లో మానసిక ఉల్లాసానికి దోహపడుతుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక లూథర్‌గిరి గ్రౌండ్స్‌లో గత నెలలో ప్రారంభించిన నగర టీడీపీ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. నగరంలోని 42 డివిజన్ల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తల జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నీలో గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానోత్సవం ఆదివారం రాజమహేంద్రవరం జేకే గార్డెన్స్‌లో జరిగింది. దీనికి ఎమ్మెల్యే వాసుతోపాటు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆర్యాపురం బ్యాంక్ ఛైర్మన్ చల్లా శంకర్రావు, శెట్టిబలిజ కార్పొరేషన్ స్టేట్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర టీడీపీ క్రికెట్ టోర్నమెంట్‌లో కార్యకర్తలు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. అలాగే నాయకులు గాని, కార్యకర్తలు పార్టీ గౌరవం తగ్గించే పనులు చేయవద్దన్నారు. అనంతరం టోర్నీలో విన్నర్‌గా నిలిచిన 3వ డివిజన్ జట్టుకు రూ.50 వేలు నగదు ట్రోఫి, రన్నర్‌గా నిలిచిన 6వ వార్డు జట్టుకు రూ.30 వేలు నగదు బహుతులు అందించారు. కార్యక్రమంలో తొలుత యువత ప్రదర్శించిన డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, మజ్జి రాంబాబు, ఉప్పులూరి జానకిరామయ్య, నక్కా చిట్టిబాబు, నక్కాదేవి వరప్రసాద్, దాస్యం ప్రసాద్, మొకమాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా పనిచేయాలి

స్థానిక ఉమామార్కండేయ స్వామి దేవస్థానం నూతన పాలక మండలి సభ్యులు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును ఆదివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కమిటీ చైర్మన్‌గా మదన్‌సింగ్ రాజ పురోహిత్, సభ్యులుగా పెండ్యాల నాగేశ్వరరావు, రాజా పురోహిత్ రూప్‌సింగ్, బి.రవికుమార్, బ్రింగిమళ్ల పద్మావతి, శనపతి సత్తిబాబు, గ్రంధి సువర్చల, పుచ్చల లీలావతి, బంగారు దీపిక, గొంగాడ సురేష్, బి.గౌతమిలను నియమించామన్నారు. ఈ కమిటీ త్వరలో ప్రమాణస్వీకారం చేస్తుందన్నారు. రాబోయే పుష్కరాలను దృష్యా భక్తులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తూ సమర్థవంతంగా పనిచేయాలని కమిటీకి సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనపర్తిలో ట్రాఫిక్ జామ్

గంట పాటు నిలిచిపోయిన వాహనాలు



అనపర్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అనపర్తి ఎర్ర కాలువ వద్ద ఆదివారం రాత్రి సుమారు గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహన దారులు ఇబ్బందులు పడ్డారు. వంతెన వద్ద ఏర్పడిన జామ్‌తో అటు పొలమూరు వైపు ఇటు ద్వారపూడి, బలభద్రపురం వైపు సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. రంగంలోకి దిగిన పోలీసులు గంట పాటు శ్రమించడంతో వాహనాలను క్రమబద్ధీకరించగలిగారు. సుమారు 15 నిమిషాల పాటు ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోవడంతో ఎటు కదిలే పరిస్థితి లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. తరచు వంతెన వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని పోలీసులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఐకమత్యంతోనే ఆలయాల అభివృద్ధి

శ్రీత్రిదండి ఆహోబిల రామానుజ జీయర్ స్వామి



అనుగ్రహ భాషణం చేస్తున్న రామానుజ జీయర్‌స్వామి

గోకవరం, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామ ప్రజలంతా ఐక్యమత్యంతో మెలిగితే ఆలయాల అభివృద్ధి సులభతరం అవుతుందని శ్రీత్రిదండి ఆహోబిల రామానుజ జీయర్ స్వామి అన్నారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలోని శ్రీరామగిరి క్షేత్రంపై నూతనంగా నిర్మించిన పుష్కరిణీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా శ్రీరామగిరి మెట్లపై సహస్ర దీపాలంకరణ పూజ నిర్వహించారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో తులసీధాత్రి పూజ చేపట్టారు. అనంతరం ఆహోబిల జీయర్ స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.శ్రీరామగిరిపై శ్రీసీతారామ నామ సంకీర్తన సంఘం ఏర్పాటు గర్వించదగ్గ విషయమన్నారు.భక్తులంతా ఐక్యంగా ఉంటే ఆలయాల అభివృద్ధి సులభతరం అవుతుందన్నారు.ఈ సందర్భంగా పుష్కరిణిని ప్రారంభించి రాధా గోదాసమేత శ్రీకృష్ణస్వామి, శ్రీ భూసమేత వల్మీక వెంకటేశ్వరస్వామి తెప్పోత్సవం నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తి శ్రద్ధలతో క్షీరాబ్ధి ద్వాదశి వేడుకలు



బిక్కవోలులో కార్తీక దామోదరునికి పూజలు చేస్తున్న భక్తులు

దివాన్‌చెరువు, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా క్షీరాబ్ధి ద్వాదశి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం జరుపుకున్నారు. విష్ణు స్వరూపంగా భావించే ఉసిరిని తీసుకువచ్చి తులసిమొక్కలో ఉంచి మహిళలు క్షీరాబ్ధి ద్వాదశి పూజ చేశారు. తులసి మొక్కకు పసుపు, కుంకుమలతోనూ, పుష్పాలతో పూజలు చేశారు. చుట్టూదీపాలు వెలిగించారు. షోడశోపచారాల అనంతరం నైవేద్యం సమర్పించారు, ప్రతీ ఏటా కార్తీక మాసంలో శుక్లపక్షం ద్వాదశిరోజున క్షీరాబ్ధి ద్వాదశిగా పూజలు చేయడం హిందూ సంప్రదాయానికి చెందిన పలు కుటుంబాలకు ఆచారంగా వస్తోంది. ఈవిధంగా పూజలు చేస్తే సౌభాగ్యం, సంపదతో బాటు మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం

ఘనంగా లక్ష తులసి పూజ..

బిక్కవోలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా గ్రామంలోని పెదరావిచెట్టు వద్ద రామాలయంలో లక్ష తులసి పూజ నిర్వహించారు. ముందుగా దామోదరునికి 36 మంది దంపతులు పూజలు చేశారు. అనంతరం సీతా రాములకు పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. ఈసందర్భంగా స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కందుకూరి ఆశయాన్ని పరిరక్షిస్తాం

చైర్మన్ డాక్టర్ యాళ్ల ప్రదీప్



కందుకూరి దంపతుల సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న ప్రదీప్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశలింగం పంతులు ఆశయాన్ని సాధించేందుకు కృషి చేస్తానని హితకారిణి సమాజం చైర్మన్ డాక్టర్ యాళ్ల ప్రదీప్ సుకుమార్ అన్నారు. హితకారిణి సమాజం నూతన పాలక మండలి ఏర్పడ్డాక కమిటీ చైర్మన్ యాళ్ల ప్రదీప్, సభ్యులు కలిసి ఆనంద్ గార్డెన్స్‌కు వచ్చి వీరేశలింగం, రాజ్యలక్ష్మి దంపతుల సమాధు లకు పూలమాలలతో నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ కందుకూరి విద్యాసంస్థలను పరిరక్షించి ఆయన ఆశయాలను సాధిస్తామన్నారు. అనంతరం మండలి డైరెక్టర్లతో కలిసి కార్యాలయంలో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

వైభవంగా గౌరీశంకరుల ఉత్సవం



ఊలపల్లిలో గౌరీ శంకరులను దర్శిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఊలపల్లిలో రెండేళ్లకొకసారి నిర్వహించే గౌరీ శంకరుల ఉత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని ఇరు వెలమలు తాము నెల రోజుల క్రితం రామాలయం, లక్ష్మీగణపతి ఆలయాల్లో వుంచి పూజలు చేస్తున్న గౌరీశంకరులను ఆదివారం తెల్లవారుజామున బయటకు తీసి ఇంటింటికీ వెళ్లి పాన్పులు వేయించుకున్నారు. మధ్యాహ్నం నుంచి గ్రామోత్సవం జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేరళ కళాకారుల వాయిద్యాలు, బ్యాండు కచేరీలు, తీన్‌మార్, బుట్ట బొమ్మలు, అఘోరాల నృత్యాలు, కాళికామాత వేషాలు ఆకట్టుకున్నాయి. గ్రామోత్సవం సోమవారం తెల్లవారే వరకూ సాగింది. వెలమ సోదరుల ఇళ్లన్నీ బంధువులతో కిటకిటలాడాయి. ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేకాకర్షణగా నిలిచింది. గౌరీ శంకరులను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆయన వెంట టీడీపీ మండలాధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి సత్యగౌరి, నాయకులు తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, రావాడ నాగు, ఇందల వీరబాబు, గేదెల వీరబాబు, కర్రి శ్రీనివాసరావు, బండారు శివ, చింతా శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గౌరీ శంకరులకు గ్రామోత్సవం జరుపుతున్న భక్తులు

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత



నరేంద్రపురంలో నగదు సహాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదివారం అందజేశారు. నరేంద్రపురంలోని పునరావాస కేంద్రంలో ఉన్న ఒక్కో కుటుంబానికి రూ.3 వేలు వంతున నగదు సహాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఇదిలా ఉండగా ఫరిజల్లిపేటలో శ్రీయోగిరాజ్ పండిత రామలాల్‌జీ మహరాజ్ ఆశ్రమంలో జరిగిన భజన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యవతిదేవి,కూటమి నాయకులు పాల్గొన్నారు.

పందెంరాయుళ్ల అరెస్టు

బిక్కవోలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కొమరిపాలెం గ్రామ శివార్లలో కోడిపందాలు ఆడుతున్న 13 మందిని ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. వీరి నుంచి రూ.4920 నగదు, ఒక కోడిని, రెండు కత్తులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసామన్నారు.

కార్తీక మాస మహోత్సవం

నల్లజర్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతవరం శివారు ఎర్రకాల్వ వద్ద ఉన్న ఉమా రామ లింగేశ్వరస్వామి ఆలయం లో ఆదివారం కార్తీకమాస మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, క్షీరాబ్ధి ద్వాదశి పూజ, సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. చీపురుగూడెం, కవులూరు, పోతవరం, సుభద్రపాలెం, పోతినీడుపాలెం, చాదరాశికుంట గ్రామాలకు చెందిన భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

వైద్యానికి ఆర్థిక సహాయం

తాళ్లపూడి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపూడి గ్రామంలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న రావూరు విజయ వెంకటకనక దుర్గకు వైద్యం నిమిత్తం ఆదివారం మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించినట్లు సంస్థ మండలాధ్యక్షుడు వెలుగుబంటి శ్రీనివాస్ తెలిపారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: బాహుబలి
సూర్యమినీ	: డ్యూడ్
సూర్యప్యాలస్	: బైసన్
స్వామి	: బాహుబలి
అనుశ్రీ(సాయికృష్ణ)	: కె-ర్యాంప్
శివజ్యోతి	: బాహుబలి
రాజా	: మాస్‌జాతర
ఊర్వశి	: తెలుసు కదా
మేనక	: కాంతారా-1
రంభ	: మాస్ జాతర
అప్సర	: మాస్ జాతర
అశోక	: మాస్ జాతర
వీఎస్ మహాల్(నామవరం)	: మాస్ జాతర
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: మాస్ జాతర
వెంకటసూర్య(కడియం)	: మాస్ జాతర
సత్యగౌరి (అనపర్తి)	: బాహుబలి
సూర్యశ్రీ (అనపర్తి)	: మాస్ జాతర
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: మాస్ జాతర
రామకృష్ణ(కోరుకొండ)	: కాంతారా-1
గీతాసినిమాస్ (సీతానగరం)	: కాంతారా-1
శ్రీనివాస (గోకవరం)	: మాస్ జాతర
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: బాహుబలి
లలితామహాల్(రంపచోడవరం)	: కె-ర్యాంప్
నవయుగ(చింతూరు)	: కె-ర్యాంప్







నరసన్న.. చూడన్నా!

అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి తెప్పోత్సవం ఆదివారం వశిష్ఠ గోదావరిలో కన్నుల పండువగా సాగింది.. వేలాదిగా భక్తజనం హాజరై స్వామిని కన్నులారా తిలకించారు.. చల్లంగ చూడు నరసన్న అంటూ కొలిచారు..



ఊరేగిన వెంకన్న..

ఆ స్వామి వైభవాన్ని చూడడానికి రెండు కన్నులూ చాలవు.. అంతలా వాడపల్లి వేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం ఆదివారం గౌతమి గోదావరిలో నిర్వహించారు. అందంగా అలంకరించిన తెప్పపై స్వామి ఊరేగారు. వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.



సత్యదేవ.. కనవా!

అన్నవరం సత్యదేవుడి హంస వాహనం ఆకట్టుకుంది.. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామి తెప్పోత్సవం పంపానదిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.

బతుకులపై హాల్‌సెల్!



ప్రస్తుతం సెల్‌ఫోన్ చాలా ప్రమాదకరంగా తయారైంది.. అది చేతిలో ఉంటే అన్నీ ఉన్నట్టే.. ఫ్రెండ్స్ కావాలంటే ఫ్రెండ్స్‌ని ఇస్తోంది.. ప్రేమికుడు కావాలన్నా.. ప్రేమికురాలు కావాలన్నా క్షణాల్లో ఇచ్చేస్తోంది.. అవి కాకుండా వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, షేర్‌చాట్ తదితర యాప్‌లు ఉన్నాయి.. ఈ సెల్‌ఫోన్‌కు యువత బానిసగా మారిపోతున్నారు.. గంటల తరబడి చాటింగ్‌లు.. గంటల తరబడి టాకింగ్‌లు.. గంటల తరబడి ఆటలు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నోఎన్నెన్నో.. చదువును వదిలేసి మరి ఆ మాయలో మునిగితేలుతున్నారు.. తెలిసీతెలియని వయసులో యువతకు అదో ప్రేమమార్గంగా ఉంది.. అది కట్టడి చేయడానికి తల్లిదండ్రులు శతవిధాలా ప్రయత్నిస్తున్నా అందులో చిక్కుకుపోయే యువతే ఎక్కువ.. సెల్ ఫోన్ ఎంత అవసరమో.. అంతే నాశనం కూడా చేస్తుందనేది జగమెరిగిన సత్యం.

జీవితంపై అలక్ష్యం!



ప్రస్తుతం ఒక లక్ష్యం పెట్టుకుని చదివే యువత చాలా తక్కువ శాతం కనిపిస్తున్నారు.. తల్లిదండ్రుల పోరు తప్ప.. ఏదో ఒకటి సాధిద్దాం అని చదువుకునే యువతరాన్ని వేళ్లపై లెక్కించవచ్చు.. తెలిసీతెలియని వయసులో ఆశలు.. కోరికలంటూ పరుగులు పెడుతున్నారు.. ఆశయాలను వదిలేస్తున్నారు.. బడి దగ్గర నుంచి కళాశాలల వరకూ ఎన్నెన్నో ప్రేమకథలు.. జీవితంలో ఏదో ఒకటి సాధించిన తరువాత ప్రేమించుకుంటే తప్పులేదు. కానీ ఏమీ లేకుండా ప్రేమ అంటున్నారు.. ఆ దోమ కుట్టడంతోనే అన్నీ గాలికే వదిలేస్తున్నారు.. ఆ ప్రేమ మోజులో పడి మోసపోయిన బాలికలు కోకొల్లలు.. మన జిల్లాలోనే చూస్తే ఏడో తరగతి చదివే బాలికలు గర్భవతులు.. ఇంజనీరింగ్ చదివే అమ్మాయి మోసపో తూనే ఉంటున్నారంటే పరిస్థితి ఎంత చేయి దాటుతుందో అర్థం చేసుకోవచ్చు.

కోరికల ఊబి..



కోరికలే గుర్రాలైతే.. అనే సామెత ఒకటుంది.. ఇది అమ్మాయికైనా.. అబ్బాయికైనా ఒక్కటే.. కోరికలు ఉండవచ్చు కానీ మితిమీరకూడదు.. ప్రస్తుతం కోరికలు మితిమీరిపోతున్నాయి. అవే యువతీ యువకులను.. బాలికలను పక్కదారి పట్టిస్తున్నాయి.. చాలా మంది బాలబాలికలు హీరోహీరోయిన్లను ప్రేమిస్తారు. వారిలా ఉండాలని తహతహలాడతారు.. అది చాలా ఖర్చుతో కూడుకున్నది.. ఆర్థిక అవసరాలకు చాలా మంది బాలికలు పక్కదారి పడుతున్నారు.. అదే వ్యసనంగా మార్చుకుంటున్నారు.. చదువుకున్నా ఏం చేసినా అదే ఆలోచన.. చదువును పక్కన పెట్టి ఎంతో మంది బాలికలు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. చదువుకునే వయసులో చదువుకుంటే భవిష్యత్ చాలా అందంగా ఉంటుంది. అది చాలా ఆలోచించకుండా కోరికలనే ఊబిలో చిక్కిపోతున్నారు.



తుఫాన్ సాయం అందజేస్తున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

మొంథా బాధితులకు సాయం

రూ.23.26 లక్షలు

కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ బాధిత 1,185 కుటుంబాలకు రూ23.26 లక్షలు ఆర్థిక సహాయం అందజేశామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.జిల్లాలో అనపర్తి మండలంలో 166 కుటుంబాలకు రూ.3.45 లక్షలు, బిక్కవోలులో 38 కుటుంబాలకు రూ.74 వేలు, గోకవరం మండలంలో 2 కుటుంబాలకు రూ.6వేలు, కడియం మండలంలో 122 కుటుంబాలకు రూ.2 .6 లక్షలు, కోరుకొండలో 19 కుటుంబాలకు రూ.41 వేలు, రాజమహేంద్రవరం అర్బన్‌లో 120 కుటుంబాలకు రూ.2.67 లక్షలు, రాజమహేంద్రవరం రూరల్‌లో 89 కుటుంబాలకు రూ.1.55 లక్షలు, రాజానగరంలో 27 కుటుంబాలకు రూ.45 వేలు చొప్పున పంపిణీ చేశామ న్నారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో 583 కుటుంబాలకు రూ.11.39 లక్షలు, కొవ్వూరు డివిజన్‌లో 602 కుటుంబాలకు రూ. 11.87 లక్షలు అందించామన్నారు.

నేడు పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం జిల్లావ్యాప్తంగా యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు జిల్లా కేంద్రానికి రాకుండా తమ డివిజన్, మండల కేంద్రాలు, గ్రామ ,వార్డు సచివాయాల్లో అర్జీలను సమర్పించవచ్చని తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను 1100 టోల్ ఫ్రీ నెంబర్ లేదా, మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా సమర్పించవచ్చని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల కోసం వాట్సప్ గవర్నెన్స్ నెంబరు 9552300009ను వినియోగించాలన్నారు.

చదువుకునేందుకు ఊరు కాని ఊరొచ్చింది.. ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూనే విద్యనభ్య సిస్తోంది.. సెల్‌ఫోన్‌లో పరిచయం ఒక యువకుడిని అన్నగా చెప్పుకునే వరకూ వెళ్లింది.. దీపావళి ముందు రోజు ఆ అన్నయ్య వచ్చాడు.. దీపావళి బాణసంచా కొని ఇస్తానని చెప్పి తీసుకెళ్లాడు. అన్నయ్య కదా అని నమ్మి వెళ్లింది. రెండు గంటల తరువాత ఒంటిపై గాయాలతో తిరిగొచ్చింది. అనుమానం వచ్చిన వార్డెన్ ఆరా తీస్తే.. జరిగింది చెప్పి గొల్లుమంది.. రాజమహేంద్రవరంలో జరిగిన ఈ సంఘటన సెల్‌ఫోన్ పరిచయం ఎంత ప్రమాదకరమో చెబుతోంది.

ఆ బాలిక 7వ తరగతి చదువుతోంది.. తెలిసీ తెలియని వయసు.. అందునా అమ్మా నాన్న లేరు.. అమ్మమ్మ వద్ద ఉండి గురుకులంలో చదువుకుంటుంది.. అమ్మమ్మ ఊరికే చెందిన తాత వయసున్న వ్యక్తి ఆ బాలికను పరిచయం చేసుకున్నాడు.. బాలికకు ఎవరూ లేకపోవడంతో ఖాళీ ఉన్నప్పుడల్లా అతను వెళ్లేవాడు.. గురుకులంలో తాతగా చెప్పుకుని బయటకు రమ్మనేవాడు. బాలిక ఊరే కావడంతో అతనితో వెళ్లేది.. అలా నాలుగుసార్లు వెళ్లింది.. నాలుగోసారి అతనిలో వికృత రూపం బయటపడింది.. తెలిసినా బాలికలు ఒకరి వెంట వెళ్లడం ఎంత ప్రమాదకరమో తునిలో జరిగిన ఈ సంఘటన రుజువు చేస్తోంది.

- రాజమహేంద్రవరం/ కాకినాడ-ఆంధ్రజ్యోతి

నమ్మొద్దు.. నమ్మొద్దు!

అమ్మాయిలు జాగ్రత్త



స్వాతంత్రం.. స్వేచ్ఛ.. రెండిటికీ మధ్య యోజనాల వ్యత్యా సం ఉందని పెద్దలు చెప్పే మాట అక్షర సత్యమని ఛిద్రమ వుతున్న బాలికలు/అమ్మాయిల జీవితాలు రుజువు చేస్తున్నాయి. రకరకాల కారణాలతో ప్రేమ.. ఆకర్షణ.. అవసరం.. వాంఛ.. వీటి మధ్య ఉన్న సున్నితమైన గీతను గుర్తించడంలో విఫలమవుతున్నారు. తమంతట తాముగా వెళ్లి జీవితాలను, తల్లిదండ్రుల ఆశలను ఛిద్రం చేసే వలకు చిక్కు తూ..చిక్కుముడుల సుడిగిండంలో ఇరుక్కుంటున్నారు. తీరా సున్నితమైన గీత దాటామని గ్రహించే సరికి జీవి తాలు వేరొకరి వాంఛల గుప్పిట్లో బందీలవుతున్నాయి. బంధువు లు సైతం కీచకులుగా మారుతున్నారు. 'మంచి స్పర్శ - చెడు స్పర్శ' అని ఎంత బోధిస్తున్నా ఫలితాలు పెద్దల రోదనలకు సమాధానం చెప్పలేకపోతున్నాయి.

6 వేల మంది చిట్టిగర్భవతులు

పెరుగుతున్న అత్యాచార కేసులు

బలైపోతున్న బాలికలు

అవగాహన లేక మోసపోతున్నారు

బాలికలు కౌమార దశలో గర్భం దాల్చుతూ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. 15 నుంచి 18 ఏళ్లలోపు వాళ్ల 2023 నుంచి ఇప్పటి వరకూ 6 వేల మంది గర్భం దాల్చారనే గణాంకాలు సమాజాన్ని హెచ్చరిస్తున్నాయి. 2016 నుంచీ గత డిసెంబరు వరకూ మిస్సింగ్ కేసులు పరిశీలిస్తే.. ఉమ్మడి, విభజిత తూర్పుగోదావరిలో బాలలు 21, బాలికలు 70 మంది ఉన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటికే పదుల సంఖ్యలో పోక్సో కేసులు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 12 ఏళ్లలోపు 45, 16 ఏళ్ల లోపు 35, 18 ఏళ్లలోపు బాలికలు 20 మంది తప్పిపోవడం లేదా ఇళ్ల నుంచి వెళ్లిపోవడం జరిగింది. గతేడాది 18ఏళ్ల పైబడిన వారిపై 23, 18 ఏళ్ల లోపు అంటే పిల్లలపై 43 అత్యాచార కేసులు నమోదయ్యాయి.ఈ 43 కేసుల్లో ఓ ఏడు తప్పా.. 36 ప్రేమ పేరుతో పరారైనవే కావడం గమనార్హం. ఇక ఆ 23 కేసుల్లో నాలుగు తప్పా మిగతా వాటిలో పెళ్లి చేసుకుంటామని చెప్పినవి ఉన్నాయి. ఈ ఏడాది ఉమ్మడి తూర్పుగోదావరిలో ఇప్పటి వరకూ వందకుపైగా బాలి కలపై అత్యాచారం కేసుల సంఘటనలు ఉన్నాయి.

తల్లిదండ్రుల అప్రమత్తతే శ్రీరామరక్ష

తల్లిదండ్రుల అప్రమత్తత, ప్రవర్తనే పిల్లల పాలిట శ్రీరామరక్ష. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల నిఘా కచ్చితంగా ఉండాలి. తమ పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారు? ఎవ రితో ఎక్కువగా మాట్లాడుతున్నారు? స్కూలు/కాలేజీకి వెళ్లేటప్పుడు విద్యార్థినులేం చేస్తున్నారు? దారి మధ్యలో పెత్తనాలు ఏవైనా చేస్తున్నారా ఇలాంటి విషయాలన్నీ గమనించాలి. హాస్టళ్లలో ఉండే తమ ఆడపిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత వారిదే. హాస్టళ్లలో పరిస్థితులు, తమ చిన్నారి ఎలా ఉంటోంది అనే విషయాలపైనా ఆరా తీయాలి. ముఖ్యంగా తమకు దూరంగా ఉండే పిల్లలతో ప్రేమగా మెలగాలి. వారి మనసులో బాధను తెలుసుకోవాలి. ఏం జరిగినా తమకు చెప్పాలనే భరోసా తల్లిదండ్రులు కల్పించాలి. తాము ఉన్నామనే ధైర్యం ఇవ్వాలి. సాధారణంగా 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ ఉరకలు వేసే వయసు కావడంతో దారితప్పే అవకాశం ఎక్కువ.అందువల్ల తల్లిదండ్రులు గమనిస్తుండాలి. పాఠశాలల్లో టీచర్ల వ్యవహారశైలి.విద్యార్థినులతో ప్రవర్తన గమనించాలి.

అధికారులేం చేస్తున్నారు..

ఇటీవల పోలీస్‌శాఖ, చైల్డ్ వెల్ఫేర్, ప్రొటెక్షన్ సెల్ ఆధ్వర్యంలో పాఠశాలలు,కళాశాలల్లో గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. పోక్సో చట్టం, ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులకు పాల్పడేవారికి విధించే శిక్షలు, అపరిచిత వ్యక్తులతో పాటు చుట్టుపక్కల సమాజంలో ఎలా మెలగాలి అనే విషయాలపైనా న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నారు. లైంగిక వేధింపులు, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే 100కు ఫోన్ చేసి తల్లిదండ్రులు సమాచారం ఇవ్వాలి.. జాప్యం జరిగే పరిస్థితి విషమించే అవకాశం ఉంది.

పిల్లల ప్రవర్తన గమనిస్తుండాలి

పిల్లల ప్రవర్తన తల్లిదండ్రులు గమనిస్తుండాలి.. సెల్‌ఫోన్ ఇస్తే నిఘా ఉండాలి. సోషల్ మీడియా ఎలా ఉపయోగిస్తున్నారనే విషయం పరిశీలించాలి. హెయిర్ కటింగ్, నడవడిక, దుస్తులు వంటివి మంచిగా ఉండేట్లు చూసుకోవాలి. ఆడపిల్లలు ఒకవేళ ఎవరి ట్రాప్‌లో అయినా ఉండి మాట వినకపోతే వెంటనే పోలీసులకు చెప్పాలి. మేం కౌన్సె లింగ్ ఇస్తాం. వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. స్కూలులో పిల్లలకు నైతిక విలువలు, మంచి నడవడిక గురించి నూరి పోస్తుండాలి.అందరం కలిసి ఆడపిల్లలను రక్షిద్దాం.

- డి.నరసింహ కిశోర్, ఎస్పీ, తూర్పుగోదావరి



నైతిక విలువలు పెంచండి

తల్లిదండ్రులు పిల్లల ర్యాంకుల చుట్టూ పరుగులు పెడుతున్నారు. నైతిక విలువలు చెప్పే వారు లేరు. ఆ తరగతి గదులూ మాయమయ్యాయి. ఇవన్నీ కలిసి పిల్లలు నడిచే తీరును వక్రమార్గంలోకి తీసుకెళ తున్నాయి. విద్యా విధానంలో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహభావంతో మెలగాలి. నీతి కథ లు, జీవితంపై చెడు చూపించే ప్రభావం, కుటుంబ విలువలు నూరిపోయాలి.

- డాక్టర్ కర్రి రామారెడ్డి, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు





చిన్నారులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీవిద్య

చిన్నారుల కిడ్నాప్ కలకలం

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఇద్దరు చిన్నపిల్లలు కిడ్నాప్‌కు గురైనట్టు కలకలం రేగింది. రాజమమహేంద్రవరం వీఎల్ పురం సమీపంలో పిరమిడ్ సమీపంలో అపార్టుమెంట్ వద్ద అన్నాచెల్లెలు భాను ప్రసాద్(7), మోహన(5) ఆదివారం మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో ఆడుకుంటున్నారు. కొద్దిసేపటికి తల్లి అపార్ట్‌మెంట్ బయటకు వచ్చి చూస్తే పిల్లలిద్దరు కనిపించలేదు. దీంతో కంగారు పడి అటూ ఇటూ చూసి పిల్లలను ఎవరో ఎత్తుకుపోయారని భావించింది. భయంతో చుట్టుపక్కల వారికి చెప్పడంతో కొంత మంది సోషల్ మీడియాలో రకరకాల పోస్టింగ్‌లు పెట్టేశారు. బాలల తల్లి ఫోన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇటు ప్రకాశ్‌నగర్ పోలీసులు అటు బొమ్మూరు పోలీసులు వెంటనే అప్రమత్తమై సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డీఎస్పీ శ్రీవిద్య ఆధ్వర్యంలో అపార్ట్‌మెంట్ వద్ద సీసీ కెమెరాలు పరిశీలించి ఆ పిల్లలు ఆడుకుంటూ పక్క వీధిలోకి వెళ్లినట్టు గుర్తించి అటువైపు వెళ్లి చూస్తే పిల్లలిద్దరు ఆడుకుంటూ కనిపించారు.ఆ పిల్లలను తీసుకుని వారి తల్లికి డీఎస్పీ శ్రీవిద్య అప్పగించి పిల్లల పట్ల జాగ్రత్తలు చెప్పారు.

ఒడ్డున.. పడుతున్నారు!



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులను మొంథా తుఫాన్ దెబ్బతీసింది. ప్రభుత్వం ఇటీవల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా తుఫాన్ వల్ల ఇబ్బంది ఏర్పడింది.మంత్రి కందుల దుర్గేష్ ఇటీవల నిడదవోలు నుంచి జిల్లాలోని కొనుగోలు కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. కానీ తుఫాన్ వల్ల కొనుగోలు ఆలస్యమైంది. జిల్లాలో చాలా పంట వాన నీటిలో మునిగిపోయింది. కొంత మేర రైతులు అయినకాడకు ధాన్యం అమ్మేసుకున్నారు. మిగిలిన ధాన్యం సోమవారం నుంచి పౌర సరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు చేయనుంది. రాజమహేంద్రవరం డివిజన్‌లో 93, కొవ్వూరు డివిజన్‌లో 119 మొత్తం జిల్లాలో 212 కేంద్రాలు ఏర్పాటు చేశారు.144 మిల్లుల ద్వారా కొనడానికి ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే రూ.135 కోట్ల బ్యాంక్ గ్యారంటీ కూడా లభించింది.

నేటి నుంచి మళ్లీ ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో 212 కేంద్రాల ఏర్పాటు
- 5.31 లక్షల టన్నుల దిగుబడి
- 4 లక్షల టన్నులు సేకరణ
- తుఫాన్ దెబ్బకు రైతుకు నష్టం
- కొనుగోలు కేంద్రాలతో ఊరట

4 లక్షల టన్నుల సేకరణ

గతంలో కంటే ఎక్కువ ధాన్యం సేకరించ డానికి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రతి ఏటా సాధారణంగా 2.5 మెట్రిక్ టన్నుల నుంచి 3 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం సేకరించేవారు. దీంతో చివరలో రైతులు ఇబ్బందిపడేవారు. రబీ సీజన్‌లో రైతులు ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ ద్వారా రబీలో మంచి ధరకు కొనుగోలు చేయ డంతో పాటు 24 గంటల్లోనే నగదు కూడా రైతు ఖాతాల్లో జమచేయడంతో రైతులు ప్రభుత్వానికే అమ్మాలనే ఆలోచనతో ముందుకొచ్చారు. దీంతో చివరి పంట రైతులు ఇబ్బంది పడ్డారు. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం రైతుల నుంచి ఈ సీజన్‌లో ఎక్కువ ధాన్యం కొనుగోలుకు నిర్ణయించింది.జిల్లాలో మొత్తం 5.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా. అందులో 4 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సీఎంఆర్‌కు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు.

74,793 హెక్టార్లలో ఖరీఫ్..

జిల్లాలోని 18 మండలాల పరిధిలో 74, 793 హెక్టార్లల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేశారు. ఇప్పటి వరకూ 9657.48 హెక్టార్లలో వరి కోతలు పూర్తయ్యాయి. డిసెంబరు 15వ తేదీ వరకూ కోతలు జరిగే అవకాశం ఉంది. కనీస మద్దతు ధర ప్రకారం కామన్ వెరైటీ క్వింటా ధాన్యానికి రూ. 2369, గ్రేడ్-ఎ రకానికి రూ.2389 ఇవ్వాల్సి ఉంది. కానీ రైతులు 17 శాతం తేమ వరకూ ధాన్యాన్ని ఆరబెట్టవలసి ఉంది. గోనె సంచుల వినియోగచార్జీలు, కూలీల చార్జీలను ప్రభుత్వమే భరిస్తుంది. క్వింటాకు గోనె సంచుల వినియోగచార్జీ రూ.4.74, కూలీల చార్జీ రూ.22 వరకూ ప్రభుత్వం ఇస్తుంది. మద్దతు ధరతో ఈ చార్జీలకు సంబంధం లేదు. తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతాంగం మాత్రం తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

తుఫాన్ నష్టం లెక్కింపు..

జిల్లాలో మొంథా తుఫాన్ నేపథ్యంలో నష్టపోయిన పంట లెక్కింపులో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే 99.77 శాతం ఎన్యూమరేషన్ పూర్తయింది. జిల్లాలో 16, 843 మంది రైతులకు సంబంధించిన 25,444 చేలను అధికారులు సర్వే చేశారు. ప్యాడీ క్రాప్ డ్యామేజీ రిపోర్టు(పీసీడీఆర్) అందజేశారు. అందులో ఇప్పటి వరకూ 8641.40 హెక్టార్లలో ఎన్యుమరేషన్ పూర్తిచేశారు. తాళ్లపూడి, గోపాల పురం, కడియం, రాజమండ్రి రూరల్, నల్లజర్ల, బిక్కవోలు మండలాల్లో పూర్తయింది. మిగిలినది పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు.



దేవుడి చెరువు చుట్టూ కూర్చుని తెప్పోత్సవం తిలకిస్తున్న భక్తజనం



హంస వాహనంపై ఊరేగుతున్న కోరుకొండ లక్ష్మీ నరసింహస్వామి

తిలకించారు.. పులకించారు!

వైభవంగా కోరుకొండ లక్ష్మీ నృసింహుడి తెప్పోత్సవం

కోరుకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పవిత్రకార్తీక మాసం క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా ఆదివారం రాత్రి హంస వాహనంపై కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవుడి కోనేటిలో విహరించారు. అంతకు ముందు స్వామివారిని ప్రత్యేక పల్లకీలో ఆశీనులు గావించి దిగువ దేవస్థానం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య కిలోమీటరు దూరంలో ఉన్న దేవుడి కోనేరు వద్దకు చేర్చారు. అక్కడ దేవుడి కోనేటిలో సిద్ధంగా ఉంచిన హంస వాహనంపై లక్ష్మీనరసింహస్వామి ఆశీనులు గావించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్ స్వామి ఆధ్వర్యంలో పెద్దింటి, పెరవలి, పెదపాటి అనువంశిక అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి హంస వాహనం దేవుడి కోనేటిలో మూడు సార్లు విహరించారు. కన్నుల పండువగా జరిగిన ఈ తెప్పోత్సవాన్ని కోరుకొండ పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు తిలకించి.. పులకించారు.తెప్పోత్సవం అనంతరం ప్రత్యేక వేదికపై శ్రీ లక్ష్మీనరసింహస్వామిని ఆశీనులను గావించి సేవాకాలం నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు, రాజానగరం ఏఎంసీ చైర్మన్ తనకాల వెంకటరమణ, నాగేశ్వరరావు దంపతులు, కోరుకొండ సర్పంచ్ లక్ష్మీసరోజవీరగణేష్ దంపతులు పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే ముప్పిడి



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో కొవ్వూరు, మద్దూరు, దొమ్మేరు, నందమూరు, ఆరికిరేవుల, కాపవరం గ్రామాలకు చెందిన ఏడుగురికి రూ.2,67,608 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి,సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, సొసైటీ చైర్మన్ చావా శ్రీనివాసరావు, బేతిన నారాయణ, అర్జిల్లి రామకృష్ణ, కంటిపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్నసమారాధనలు

చాగల్లు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) కార్తీక మాసం సందర్భంగా నెలటూరు శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ఏకాహం పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం అన్నసమారాధన జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కోడూరి వారి రామాలయంలోను ఏకాహం పూజలు, భజన కార్యక్రమాలు అనంతరం అన్నసమారాధన జరిగింది. చాగల్లు చిలకమ్మబీడులోని దానవయ్యస్వామి ఆలయంలో నాగులచవితి పండుగను వేడుకగా నిర్వహించారు. ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు జరిగాయి.ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నదానం నిర్వహించారు.ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాటిమ్మపేటలో శ్రీకోదండ రామాలయంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివలింగం సహా పలు ఆకృతుల్లో దీపాలను అమర్చారు. స్థానిక మహిళలు పాల్గొని దీపాలు వెలిగించారు.

తాళ్లపూడిలో ఘనంగా లక్షపత్రి పూజ



లక్షపత్రి పూజలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

తాళ్లపూడి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా తాళ్లపూడి ఉమా పరమేశ్వరస్వామి ఆలయంలో శివునికి లక్షపత్రి పూజ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా ఉసిరి చెట్టుకు పూజలు చేసి అనంతరం శివునికి లక్షపత్రి పూజను ప్రారంభించారు. కార్యక్రమంలో మండలంలోని ఆర్యవైశ్యులు భారీగా పూజలో పాల్గొన్నారు. పూజల అనంతరం వన సంతర్పణ భోజనాలు నిర్వహించారు.

మహిళల ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ వీక్షణ



కొవ్వూరు ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్

కొవ్వూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మహిళల క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు కొవ్వూరు ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌ను ఆదివారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో 69వ ఏపీ అండర్-17 అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ బాలబాలికల వాలీబాల్ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. పోటీలను ఎమ్మెల్యే ముప్పిడి వీక్షించారు. క్రీడాకారులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా మహిళల క్రికెట్ ప్రపంచ కప్ టోర్నీ టైటిల్ పోరులో ఆదివారం దక్షిణాఫ్రికా జట్టుతో ఇండియా తలపడింది. ఈ నేపథ్యంలో క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపేందుకు మ్యాచ్‌ను వీక్షించడానికి కొవ్వూరు ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో నిర్వాహకులు ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఇండియా విజయం సాధించాలని క్రీడాకారులు నినాదాలు చేశారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులకు అవంతీ ఫీడ్స్ యాజమాన్యం సహకారంతో వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, ఎస్.అమీరుద్దీన్, కొయ్యల ప్రసాద్ మాస్టార్, వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు పాల్గొన్నారు.

బాధితులకు ప్రభుత్వం అండ



చిట్యాలలో బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న సువర్ణరాజు

ఆర్థికసాయం పంపిణీలో ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల ఇబ్బందులు పడిన వారినందరినీ ఆదుకోవాలని ప్రభుత్వం యోచిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తుఫాన్ నేపథ్యంలో పునరావాస కేంద్రాలో ఉన్న వారికి ప్రభుత్వం అందించిన రూ.1,17,000 ఆర్థికసాయాన్ని ఆదివారం తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వూరు టౌన్‌లోని బ్రిడ్జిపేటవాసులు 38 కుటుంబాలకు, మద్దూరులంకలోని 15 కుటుంబాలకు చెందినవారికి మనిషికి రూ.వెయ్యి, కుటుంబానికి రూ.3 వేలు చొప్పున పంపిణీ చేశామన్నారు. మత్స్యకారులకు త్వరలో నిత్యావసర సరుకులు అందించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, అక్షయపాత్ర రవీంద్ర,సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, అర్జిల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: తుఫాన్ నేపథ్యంలో పునరావాస కేంద్రంలో ఉన్న వారికి ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. పునరావాస కేంద్రంలో ఉన్న 19 కుటుంబాలకు రూ.50 వేలును ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, కేతా సాహెబ్, తహశీల్దార్ ఎం.మెరికమ్మ అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దొంగ రామకృష్ణ, గ్రంధి రాంబాబు, ఆళ్ల సత్తిబాబు,యూఆర్ కోటేశ్వరరావు, కొడవటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: ఆపన్నులకు జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు అన్నారు. మండలంలోని చిట్యాల గ్రామంలో ఇటీవల తుఫాన్ కారణంగా పాక్షికం గా దెబ్బతిన్న మాడుగుల పోసిబాబు, గాంధీ, కోడి ఏసు కుటుంబాలకు ఆయన నిత్యావసర సరుకులు, దుప్పట్లు, బట్టలు, కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు పోలినాటి రాజేంద్ర, పగడాల మల్లిబాబు, పోసిన గణపతి, నూతంగి శ్రీను, కృష్ణమోహన్, సత్యనారాయణ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తుఫాను నేపథ్యంలో మండలంలోని అన్నదేవరపేటలో పునరావాస కేంద్రంలో ఉన్న 10 కుటుంబాలకు రూ.20 వేలు, ప్రక్కిలంక పునరావాస కేంద్రంలో ఉన్న 21 కుటుంబాలకు రూ.44 వేలను కూటమి నాయకుల ద్వారా అందించినట్టు తహశీల్దార్ లక్ష్మీలావణ్య తెలిపారు. కార్యక్రమంలో కొఠారు వెంకట్రావు, కూచిపూడి గణపతి, పల్లి ప్రకాష్ పాల్గొన్నారు.



చాగల్లులో ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు



ఆర్థిక సహాయం అందిస్తున్న తాళ్లపూడి నాయకులు

ఘనంగా లక్ష తులసి పూజ

బిక్కవోలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా గ్రామంలోని పెద రావిచెట్టు వద్ద వున్న రామాలయంలో ఆదివారం ఘనంగా లక్ష తులసి పూజ నిర్వహించారు. ముందుగా దామోదరునికి 36 మంది దంపతులు పూజలు చేశారు.అనంతరం సీతారాములకు పంచామృతాలతో అభిషేకాలు జరిపి లక్ష తులసి పూజ జరిపారు.

కార్తీకమాసం శ్రీకృష్ణ భవానుడికి ప్రీతిపాత్రం



సాయిబాబా ఆలయం వద్ద తులసి పూజలో పాల్గొన్న మహిళలు

» లివ్‌గీత లైవ్‌గీత మెంటర్ కృష్ణప్రియ
» గోపాలపురంలో దామోదర హారతి

గోపాలపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం శ్రీకృష్ణభవానునికి ఎంతో ప్రీతిపాత్రమైందని లివ్ గీత లైవ్ గీత మెంటర్ కృష్ణప్రియ, కల్యాణ్ ప్రసాద్ మాతాజీ పేర్కొన్నారు. గోపాలపురంలోని సుతాపల్లి మీనాక్షి శ్రీనివాస్ దంపతుల గృహంలో ఆదివారం దామోదర హారతి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా వచ్చేసిన కల్యాణ్ ప్రసాద్ మాతాజీ మాట్లాడుతూ పరమ పవిత్రమైన దామోదరమాసం(కార్తీక మాసం) శ్రీకృష్ణునికి ఎంతో ఇష్టమైందన్నారు. ఈ మాసానికి అధిపతి శ్రీమతి రాధారాణి అన్నారు. ఎవరైతే భక్తిశ్రద్ధలతో దామోదర మాసంలో భగవాన్ శ్రీకృష్ణుల వారికి నేటిదీపం సమర్పిస్తారో వారికి రెప్పపాటు కాలంలో పాపాలన్ని హరించుకుపోతాయని శాస్త్రం చెబుతుందన్నారు. మహా ద్వాదశి రోజున ఎవరైతే భక్తిశ్రద్ధలతో యాశోదన దామోదర భగవాన్‌కి హారతి సమర్పించిన జన్మజన్మల పాపాలు నశించిపోతాయని వేదాలు చెబుతున్నాయన్నారు. తాము కొన్నాళ్ల నుంచి పూజ్యగురువులు శ్రీలీలా పురోషత్తమ ప్రభూజీ ఆశీస్సులతో ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే దామోదర భగవానునికి దీప హారతి సమర్పించి శ్రీకృష్ణ కథ శ్రవణం అనంతరం ఏకాదశి ప్రసాదాన్ని వితరణ చేసినట్టు పేర్కొన్నారు. ఈ రోజు ఎవరైతే కృష్ణ తులసీలకు హారతి ఇచ్చి పూజలు చేస్తారో వారి జన్మ ధన్యమవుతుందన్నారు. ప్రతీ ఒక్కరు భగవద్గీతను పారాయణం చేసి ఆ అద్భుత గ్రంథం ప్రకారం నడుచుకుని జీవితాన్ని సకారం చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు మీనాక్షి శ్రీనివాస్ దంపతులు ఆతిథ్యం ఇచ్చి ఆదరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్తీక మాస మహోత్సవం



నల్లజర్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతవరం శివారు ఎర్రకాల్వ వద్ద ఉన్న ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కార్తీకమాస మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, క్షీరాబ్ధి ద్వాదశి పూజ, సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. చీపురుగూడెం, కవులూరు, పోతవరం, సుభద్రపాలెం, పోతినీడుపాలెం, చాదరాశికుంట గ్రామాలకు చెందిన భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కొవ్వూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ మహిళా హెడ్‌కానిస్టేబుల్ లలితకుమారి తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లిలోని బంగారంపేటలో రైసు మిల్లులో పని చేసేందుకు పార్వతీపురం జిల్లా నాయుడువలస గ్రామం నుంచి 18 మంది కూలీలు వచ్చారు. వారిలో చల్ల సోమన్నదొర అలియాస్ భాస్కరరావు అక్టోబరు 25వ తేదీన వెళ్లిపోయాడు. తనతో పాటు పనికివచ్చిన వారంతా సోమన్నదొర ఇంటికి వెళ్లిపోయాడని అనుకున్నారు. అదే రోజు భాస్కరరావు సోదరుడు.. అన్నయ్య ఇంటికి రాలేదని ఫోన్ చేయడంతో చుట్టుప్రక్కల వెతికారు. కనిపించకపోవడంతో పక్కి సత్యనారాయణ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

వైద్యానికి ఆర్థిక సహాయం

తాళ్లపూడి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపూడి గ్రామంలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న రావూరు విజయ వెంకటకనక దుర్గకు వైద్యం నిమిత్తం ఆదివారం మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించినట్టు సంస్థ మండలాధ్యక్షుడు వెలుగుబంటి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సనపల రాజశేఖర్, అప్పన హనుమంతరావు,మాధవరపు రామచంద్రం, దుగ్గిరాల సూర్యనారాయణ, గెడ్డం సాయిబాబా, కొప్పాక వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, భక్తులు

నయనానందకరం.. నౌకావిహారం

• పంపా సరోవరంలో ఘనంగా సత్యదేవుడి తెప్పోత్సవం • తరించిన భక్తజనం



స్వామి,అమ్మవార్లను తీసుకొచ్చి హారతి ఇస్తున్న అర్చకులు, ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

అన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న రత్నగిరివాసుడైన సత్యదేవుడి నౌకావిహారం ఆదివారం భక్తజనుల గోవిందనామస్మరణల నడుమ నయనానందకరంగా జరిగింది. అనంతలక్ష్మి సమేతుడైన స్వామి పచ్చనికొండల నడుమ పంపా హోయలలో హంసవాహనంపై ముమ్మారు విహరించగా ప్రకృతి పరవశించింది. విద్యుద్దీపఅలంకరణలు, కళ్ల మిరుమిట్లుగొలిపే బాణాసం చా కాల్పుల న డుమ ఆహ్లాదభరిత వాతావరణంలో ఈ కమనీయ వేడుక ఘన ంగా జరిగింది. సాయం త్రం 5గంటలకు కొండపై నుంచి స్వామి,అమ్మవార్లను, క్షేత్రపాలకులైన సీతారాములను పల్లకీలో ఘాట్‌రోడ్డు గుండా బాజాభజంత్రీలు, వేదమంత్రాల నడుమ పం పాసరోవర తీరంవద్దకు తోడ్కొనివచ్చారు. వివిధ సుగంధభరిత పుష్పమాలికలతో తీర్చిదిద్దిన ప్రత్యేకవేదికపై సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మ వార్లను, మరో వేదికపై సీతారాములను ఆశీనులు గావించి పండితులు వేద స్వస్తితో కార్యక్రమానికి శ్రీకారం చుట్టా రు. ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు చామర్తి వెంకటరెడ్డి పంతులు, పాలంకి పట్టాభి తదితరులు గణపతిపూజ, పుణ్యాహవచనం శ్రీసూక్త, పురుషసూక్త విధానంలో క్రతువు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక వద్ద అర్చకస్వాములు తులసి ధాత్రి పూజను జరిపించారు. ప్రత్యేకపూజలు అనంతరం స్వామి, అమ్మవార్లను పంపాతీరం వద్ద ప్రత్యేకంగా తయారుచేయించిన హంసవాహనంపైకి తీసువెళ్లి మరోమారు పూజలు అనంతరం 3పర్యాయాలు పంపా సరోవరంలో నౌకావిహారం గావించారు. అనంతరం చతుర్వేదపండితులు మహదాశీర్వచనం అందజేయగా భక్తులకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు:

సాధారణ భక్తులు తిలకించేందుకు ఎల్ఈడీ స్ర్కీన్లు ఏర్పాటుచేయగా ప్రముఖులు నౌకావిహారం చూసేందుకు తీరం వద్ద ప్రత్యేక గ్యాలరీ, భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టగా పెద్దాపురం డీఎస్పీ శ్రీ హరిరాజు ఆదేశాలతో ప్రత్తిపాడు సీఐ, అన్నవరం ఎస్ఐ బందోబస్తు నిర్వహించారు. ప్రవాహం ఎక్కువగా ఉండడంతో హంసవాహనంపైకి ముందుగా అనుకున్న 18 మంది వైదికబృందాన్ని 12 మందికి కుదించారు. ముందుజాగ్రత్త చర్యగా పంపా సరోవరంలో హంస వాహనం తిరిగే దూరాన్ని తగ్గించారు.

ఆనవాయితీగా వేడుక...

ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు పాలకడలిలో శయనించి భాద్రపద ఏకాదశి (పరివర్తన ఏకాదశి) రోజున ఒకపక్కకు ఒదిగుతారు కార్తీక మాసంలో వచ్చే క్షీరాబ్దిద్వాదశి రోజున శ్రీ మహావిష్ణువు మేల్కొనడానికి ప్రతీకగా విష్ణుస్వరూపుడైన సత్యదేవుడికి ఈ వేడుకను జరపడం ఆనవాయితీగా వస్తున్నది.



తుఫాన్ బాధిత కుటుంబాలకు నగదు అందజేస్తున్న సొసైటీ చైర్‌పర్సన్ రామారావు

తుఫాన్ బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

దేవరపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో నిర్వాసితులకు ప్రభుత్వ సాయం కింద రూ.15వేలు అందించినట్టు సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు అన్నారు. దేవరపల్లిలో ఆదివారం గ్రామానికి చెందిన తుఫాన్ నిర్వాసితులు నక్కా రాజు, గండికోట చింగయ్య, నక్కా ఏడుకొండలు, గండికోట ఏడుకొండలు కుటుంబాలకు రూ.3వేలు చొప్పున రూ.15వేలు రామారావు అందజేశారు. తుఫాన్ వల్ల దెబ్బతిన్న కూలిపోయిన ఇళ్లకు కొత్త ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకారాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కె.నాగేంద్ర, వీఆర్వో లక్ష్మి, సొసైటీ డైరెక్టర్ తంగెళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టెన్నికాయిట్ పోటీలకు ఎంపికలు

దేవరపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో జూనియర్ బాలబాలిక టెన్నికాయిట్ ఎంపిక పోటీలు రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 3న నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడాకారుల అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్, ఆచంట వెంకటేశ్వరరావు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు 2007 తరువాత పుట్టినవారై ఉండాలని వయసు ధృవీకరణ పత్రం, ఆధార్, స్కూల్, కాలేజీ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు.

బడి పండుగకు..రండి!

వెంకటశాస్త్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేడుకలకు ఏర్పాట్లు

పెరవలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకరపర్రులోని వెంకటశాస్త్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 75వ సంవత్సర వేడుకను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దాత ఆణివెళ్ళ వెంకటశాస్త్రి 1950లో హైస్కూల్ నిర్మాణానికి ఉచితంగా ఐదు ఎకరాల భూమిని ఇవ్వడంతో హైస్కూల్ ఏర్పడింది. అప్పటి నుంచి చుట్టుపక్కల తీపర్రు, వెంకటరాయ పురం, కాపవరం గ్రామాలకు చెందిన అనేక వందల మంది విద్యార్థులు దేశ, విదేశాలతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్నారు.వీరందరిని ఒక చోటకు చేర్చి వేడుకలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కాకరపర్రులో చదివిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని నిర్వాహకులు కోరుతున్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

దేవరపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెనుక నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొనడంతో మోటారు సైకిస్టు దుర్మరణం చెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం రంగరాయ కాలనీకి చెందిన షేక్ ఇమామ్ (50) రాళ్లు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పనిమీద బైక్‌పై బయల్దేరాడు. ఏలూరు నుంచి కొవ్వూరు వైపు వెళ్తున్న అతడిని మండలంలోని దుద్దుకూరు సమీపంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా నిర్లక్ష్యంగా వచ్చిన వ్యాన్ ఢీకొంది. కిందపడిన ఇమామ్ తల డివైడర్‌కు తగలడంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే కన్నుమూశాడు. అతడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం చెప్పారు.



మృతుడు షేక్ ఇమామ్ (పాత చిత్రం)



కరుణించు కోటసత్తెమ్మ

నిడదవోలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెం గ్రామంలోనున్న కోట సత్తెమ్మ అమ్మవారిని వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన, మహా నివేదన జరిపారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవి శంకర్ వాటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఉండ్రాజవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తుఫాన్ పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న 46 కుటుంబాలకు ప్రభుత్వం రూ. లక్షా 17 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం ఆయా గ్రామాల్లో అందజేశారు. బాధిత కుటుంబాలకు 25 కిలోల బియ్యంతో పలు నిత్యావసర సరుకులను అందజేశారు. తాడిపర్రు, ఉండ్రాజవరం, మోర్త, పసలపూడి, దమ్మెన్ను, కె.సావరం, కాల్దారి గ్రామాల్లో బాధిత కుటుంబాలకు కూటమి నాయకులు, అధికారులు ఆయా గ్రామాల్లో వారికి అందజేశారు.

క్రికెట్ అభిమానుల సందడి

ఉండ్రాజవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భారత్-సౌతాఫ్రికా ఉమెన్ ఫైనల్ కప్ సందర్భంగా ఆదివారం మండలంలోని వేలివెన్ను గ్రామంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో క్రికెట్ అభిమానులు చూసేందుకు స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఉమెన్స్ వరల్డ్ కప్ టోర్నీలో విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు.

ఆటోబోల్తా ముగ్గురికి గాయాలు

దేవరపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చాగల్లు నుంచి దేవరపల్లి మండలం వాదాల కుంటలోని వ్యవసాయ పనులకు ఐదుగురు కూలీలు ఆటోలో వెళ్తుండగా మార్గ మధ్యలో దుద్దుకూరు వద్ద ఆటో బ్రేక్ ఫెయిల్ అయి తిరగబడటంతో ముగ్గురికి గాయాలయ్యా యి. వారిని గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. దీనిపై ఫిర్యాదు అందలేదని పోలీసు వర్గాలు తెలిపాయి.